# మనం

## అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా

బుధవారం - 23 - సెప్టెంబర్ - 2026 : పేజీలు 12


## ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం, కలెక్టరేట్ సెప్టెంబర్ 22 మనం న్యూస్ :**
ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు.మంగళవారంఅనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను

మిగతా 2లో

## స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి



- మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే!
- డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం.. జగన్ రెడ్డి సిద్ధమా?
- నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు పోరాడిన వ్యక్తి పరిటాల రవి
- స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నా
- పాదయాత్రలో నాతో నడిచిన వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా
- రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ సభలో మంత్రి లోకేష్





**అనంతపురం సెప్టెంబర్ 22 మనం న్యూస్ :**
ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. జగన్ రెడ్డి సిద్ధమా అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరోసారి సవాల్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు కూడలిలో ఏర్పాటుచేసిన స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ముందుగా భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... ఈ రోజు మనం వేదికపై ఉన్నామంటే కారణం వేదిక కింద ఉన్న టీడీపీ కార్యకర్తల త్యాగం వల్లే. ఈ రోజు నేను స్వర్గీయ ఎన్టీఆర్ మనవడిగా, సీఎం చంద్రబాబు తనయుడిగా, బాలయ్య మావయ్య అల్లుడిగా రాలేదు. ఎత్తిన పసుపు జెండా దించకుండా, మడమ తిప్పకుండా, టీడీపీకి కాపలాకాసిన కార్యకర్తగా ఇక్కడకు వచ్చాను. అన్న ఎన్టీఆర్ ఏ ముహూర్తంలో పార్టీని స్థాపించారో తెలియదు. నాకు అక్కతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లు లేరు, కానీ కోటి మంది కుటుంబ సభ్యులను ఇచ్చారు. మీ పౌరుషమే వేరు. అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. రాజకీయాల్లో, సినిమాల్లో స్వర్గీయ ఎన్టీఆర్ స్టైలే వేరు. ఆనాడు యువగళంలో

మిగతా 2లో

## నిర్లక్ష్యంలో హనకనహాళ్ సచివాలయం




- విధులకు సిబ్బంది సక్రమంగా హాజరు కావడం లేదని గ్రామస్తుల ఆవేదన
- వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండల కేంద్రానికి వెళ్లలేని దుస్థితి
- ఉన్నతాధికారులు స్పందించకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సిద్ధమంటున్న రైతులు

**కనేకల్, సెప్టెంబర్ 22 మనంన్యూస్ :**
మండల పరిధిలోని హనకనహాళ్ గ్రామ సచివాలయంలో సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత సమయ పాలన పాటించకుండా విధులకు వస్తున్నారని ఆరోపిస్తున్నారు. సచివాలయం ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. గ్రామస్తుల కథనం మేరకు.. ఉదయం 11.30 గంటల వరకు సచివాలయంలో ఒక్క ఉద్యోగి కూడా కనిపించని పరిస్థితి ఉంటోందని తెలిపారు. ఒకరిద్దరు సిబ్బంది వచ్చినప్పటికీ మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు.దీంతో రేషన్ కార్డులు, పింఛన్లు, జనన ధ్రువీకరణలు, రైతు భరోసా తదితర పనుల కోసం సచివాలయానికి వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. చివరకు పనులు పూర్తికాక నిరాశతో ఇళ్లకు తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.వంకల ఉధృతితో మరింత ఇబ్బందులు...వర్షాకాలంలో గ్రామ పరిసరాల్లోని వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి సమయంలో స్థానిక సచివాలయం ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ సిబ్బంది గైర్హాజరు కావడం వల్ల సమస్యలు మరింత పెరుగుతున్నాయని పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్.. హనకనహాళ్ సచివాలయంపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజా సమస్యలను

మిగతా 2లో

## హ్యాండ్స్ టీ–ఐలో హెచ్ఐవీ బాధితుల గోప్యతకు భంగం



- సంబంధం లేని వ్యక్తుల సమక్షంలో వ్యక్తిగత వివరాల చర్చ.. ఫొటోలు తీస్తున్నారంటూ బాధితుల ఆవేదన
- ఏపీఎస్ఏసీఎస్, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్

**గుత్తి, స్పెషల్ కరస్పాండెంట్ సెప్టెంబర్ 7 (మనంన్యూస్):**
ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీఎస్ఏసీఎస్) ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ (టీ–ఐ) కార్యక్రమంలో హెచ్ఐవీతో జీవిస్తున్న వారి గోప్యతకు భంగం కలుగుతోందంటూ పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హ్యాండ్స్ ఎన్జీవో పరిధిలోని టీ–ఐ కార్యక్రమాల్లో ప్రాజెక్టు డైరెక్టర్‌కు సంబంధం లేని ఇతర వ్యక్తుల జోక్యం పెరగడం వల్ల తమ వ్యక్తిగత, ఆరోగ్య సంబంధిత వివరాలు బయటకు వెళ్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ (నివారణ నియంత్రణ) చట్టం, 2017 ప్రకారం హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల గోప్యత, గౌరవం, వివక్షకు గురికాకుండా ఉండే హక్కులకు రక్షణ కల్పించబడింది. అయితే టీ–ఐ కార్యక్రమాల్లో ఈ నిబంధనలకు విరుద్ధంగా తమ వ్యక్తిగత విషయాలు ఇతరుల సమక్షంలో చర్చిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అనంతపురం జిల్లా పరిధిలోని గుత్తితో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని డోన్, పత్తికొండ, నందికొట్కూరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు సంస్థకు

మిగతా 2లో





# ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

జిల్లా కలెక్టర్ తనిఖీచేయడం జరిగింది. ఈసందర్భంగా ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతాచర్యలను, లాక్ బుక్‌లను జిల్లాకలెక్టర్‌పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని, ఏ ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో డిఆర్ఓఏ.మాలోల,ఎన్నికలవిభాగండిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, వైఎస్ఆర్సిపి ప్రతినిధి శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ ప్రతినిధి మసూద్ వలి, కాంగ్రెస్ ప్రతినిధి ఇమామ్, సిపిఐ(ఎం) ప్రతినిధి రామాంజనేయులు, బిజెపి శ్యామ్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంలో హనకనహళ్ సచివాలయం

పరిష్కరించేందుకు సిబ్బందిఅందుబాటులోఉండేలా చూడాలని విజ్ఞప్తిచేస్తున్నారు.సమస్యపరిష్కారం కాకపోతేకలెక్టరేట్ఎదుటధర్నాచేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు,యువకులుహెచ్చరించారు.ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించిసచివాలయపనితీరునుమెరుగుపరచాలనిగ్రామస్తులు కోరుతున్నారు.

# మంత్రి నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన ఎమ్మెల్యే కాలవ



**అనంతపురం సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** రాప్తాడులో మంగళవారం నిర్వహించిన స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాయ దుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుపాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌తో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆత్మీయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో మంత్రిసబితా, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సురేంద్ర బాబు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పరిటాలశ్రీరామ్,పలువురుఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



# బీఎస్పీ జిల్లా కార్యదర్శిగా మాల్యవంతం రాంప్రసాద్




**బత్తలపల్లి, సెప్టెంబర్ 22 మనంన్యూస్:** బత్తలపల్లి మండలం మాల్య వంతం గ్రామానికి చెందిన మాల్యవంతం రాంప్రసాద్ బహుజన్ సమాజ్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు.బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులుబందెలగౌతమ్ మార్గదర్శకత్వంలో, జిల్లా అధ్యక్షులు సాకే వినయ్ కుమార్ ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్, రాష్ట్ర కార్య దర్శులు అంపావతి గోవిందు, శ్రీరాములు, జిల్లా అధ్యక్షులు సాకే వినయ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. బహుజన్ సమాజ్ పార్టీ ఆశయాలైన సామాజిక న్యాయం, సమత్వం, బహుజనుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలపరిష్కారంకోసంప్రజలతోకలిసినిబద్ధతతోపనిచేస్తానని వెల్లడించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి



దారి పొడవునా ప్రజలు నాకు నీరాజనాలు పలికారు. పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ఆనాటి సంబరం మళ్లీ ఈనాడు చూస్తున్నా.

**నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు పోరాడిన వ్యక్తి పరిటాల రవి...** నేను కూడా అన్న ఎన్టీఆర్ సీఎం అయిన తర్వాతనే పుట్టా. రూ.2కే కిలో బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎన్టీఆర్ గారు చేపట్టారు. ఈ రోజు మనందరం అన్న ఎన్టీఆర్ గారి వారసులం. ఈ రోజు మనం ఎక్కడికి వెళ్లినా గర్వంగా చెప్పుకోవచ్చు.. నా పార్టీ తెలుగుదేశం, నా పార్టీ, నా అజెండా అన్న ఎన్టీఆర్ అని. చంద్రబాబు గారు మొదటిసారి ముఖ్యమంత్రి అయినా అభివృద్ధి, సంక్షేమం చేశారు. పరిటాల రవి కూడా ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పనులు చేశారు. మన పార్టీ అధికారంలోకి రాకముందు రాయలసీమలో మహిళలు బయట తిరగాలంటే బయపడే పరిస్థితి. దానికి ఫుల్ స్టాప్ పెట్టిన నాయకుడు మన పరిటాల రవీంద్ర . నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేశారు. ఆనాడు వందలాది మంది మన కార్యకర్తలను హత్య చేశారు. అయినా పరిటాల రవి ఏనాడు భయపడలేదు. పార్టీ సమావేశానికి వెళ్తే చంపేశారు. అయినా ఆ కుటంబం వెనక్కి తగ్గలేదు. పరిటాల సునీతమ్మ ముందుకు వచ్చారు. అసెంబ్లీలో బయపెట్టినా ఆమె భయపడలేదు. పార్టీని ముందుకుతీసుకెళ్లారు. ఇప్పుడుపరిటాల శ్రీరామ్‌ని కూడా పార్టీకి అంకితం చేశారు.

**ఫైటర్ జెట్ తయారీ ఏఎంసీఏ ప్రాజెక్ట్ ను అనంత గడ్డకు తీసుకువచ్చాం...** రాప్తాడు ప్రజలు చాలా మంచివారు. ప్రజలను కలిసినప్పుడు ఇప్పుడు ఎవరూ నా చేతులను గీరలేదు. ధర్మవరంలో అయితే మొత్తం గీరేశారు. కార్యకర్తలు, నాయకులు 2019-24 మధ్య పడిన కష్టాలను గుర్తుచేసుకోవాలి. జీవో 1 ద్వారా యువగళం పాదయాత్రను అడ్డుకోవాలని చూశారు. స్టూల్, మైక్ లాక్కున్నారు. అయినా ఎక్కడా తగ్గలేదు. వేదిక ముందున్న నాయకులు, కార్యకర్తల ప్రోత్సాహంతో ఆనాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో యువగళం పాదయాత్ర చేశా. ఇక్కడి ప్రజల కష్టాలను చూశా. అందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫైటర్ జెట్ లు తయారుచేసే ఏఎంసీఏ ప్రాజెక్ట్ ను మన అనంతపురం గడ్డకు తీసుకువచ్చా. సాగు, తాగునీరు, పరిశ్రమలను తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రత్యేకంగా నాపై బాధ్యత ఉంది. ఎందుకంటే అన్న ఎన్టీఆర్ ను, హరి మావయ్య, బాలయ్య మామను గెలిపించి శాసనసభకు పంపించిన అద్భుతమైన నేల ఇది. తాగునీరు, సాగునీరు అందిస్తాం.

**కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం...** త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. ఎన్నికలు.. ఎన్నికలే.. తగ్గేదేలే. కష్టపడాలి, పనిచేయాలి. మనది పెద్ద కుటుంబం. కోటి ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారు. మన కుటుంబం పెద్దదైంది. ఇప్పుడు పవనన్న కూడా మన కుటుంబ సభ్యుడు అయ్యారు. బీజేపీ కూడా మన కుటుంబంలో చేరింది. మూడు పార్టీలు ఏపీని ముందుకు తీసుకెళ్తున్నాయి. సమస్యలు ఏవైనా ఉంటే నాలుగు గోడల మధ్య కూర్చొని పరిష్కరించుకుందాం. నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి అందరూ కట్టుబడి ఉండాలి. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి గౌరవిస్తాం. మన రాష్ట్రాన్ని మనందరం కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరంఉంది.మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది.

**మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే!...** గొడ్డలితో బతికినవాళ్లు గొడ్డలితోనే పోతారు. పాఠాలు చెప్పే టీచర్లపై ఎలా దాడి చేశారో చూశాం. అయ్యా జగన్.. ఎందుకు మా ఉపాధ్యాయులంటే నీకు అంత కక్ష. డీఎస్సీపై చర్చకు సిద్ధమని నేను ఎన్నోసార్లు చెప్పా. నేను సిద్ధం.. నువ్వు సిద్ధమా? జగన్ రెడ్డి మాదిరిగా ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లాలంటే మాకు కోర్టు అనుమతి అవసరం లేదు. నీతి, నిజాయతీతో బతికినవాళ్లం. జగన్ రెడ్డి పెట్టిన కేసులు దొంగ కేసులని ఏకంగా సుప్రీంకోర్టే తేల్చిసిన పరిస్థితి. జగన్ రెడ్డి జాగ్రత్తగా ఉండు.. మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. ఉపాధ్యాయులపై దాడికి రౌడీమూకలను పంపారు. మొన్నటివరకు మన పార్టీలో వంగి, వంగి ఉన్నారు. ఇప్పుడు అక్కడకు వెళి కాలరెగరేస్తున్నారు. వదిలిపెట్టను భయ్యా! అన్నీ చూస్తున్నా. ఉపాధ్యాయులపై కోడిగుడ్లు వేస్తారా? అసభ్యంగా మాట్లాడతారా? అసలు మీరెక్కడ చదివారు? ఎవరు చదివించారు? ఇదేనా ఇంట్లో మీ తల్లిదండ్రులు నేర్పించిన సంస్కృతి? ఇదేనా ఉపాధ్యాయులకు మీరిచ్చే గౌరవం. నేను వదిలిపెట్టను. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టేది లేదు. రెడ్ బుక్ కు కట్టుబడి ఉన్నా. ప్రజలకు కూడా చెప్పా. వారి ఆశీస్సులతో 94శాతం స్థానాలు కైవసం చేసుకున్నాం. ఇక్కడున్న కార్యకర్తలకు ఒకటే చెబుతున్నా.. కష్టపడదాం, ప్రజలకు సేవచేద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి. ఈగో వద్దు, ప్రజల్లో ఉందాం.

**పాదయాత్రలో నాతో నడిచిన వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా...** రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలను ఆవిష్కరించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ రోజు నా తమ్ముడు పరిటాల శ్రీరామ్ పుట్టిన రోజు. నా తమ్ముడు పుట్టినరోజు నాడు విగ్రహాలను ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నా. శ్రీరామ్ కు ఉదయం లేచిన వెంటనే పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ మొదటి మెసేజ్ పెట్టింది నేనే. ఒక్కసారి నమ్మితే నేను వదిలిపెట్టను. ఆనాడు పాదయాత్రలో నాతో నడిచిన వారు, ఆనాడు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మీరు నన్ను నడిపించారు. నా జీవితాంతం మిమ్మల్ని నా గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని చెప్పారు. తనకు ఘనస్వాగతం పలికిన రాప్తాడు ప్రజలకు ఈ సందర్భంగా మంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి ఎస్.సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే, హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు ఎం.ఎస్ రాజు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకట ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, హిందూపురం పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

# హ్యాండ్స్ టీ-ఐలో హెచ్ఐవీ బాధితుల గోప్యతకు భంగం

చెందిన ప్రెసిడెంట్ హాజరవుతున్నారని, ఈ సందర్భంగా హెచ్ఐవీతో జీవిస్తున్న వారి వ్యక్తిగత విషయాలు అందరి ముందు చర్చకు వస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. దీంతో తాము తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నామని వారు వాపోతున్నారు.టీ-ఐ కార్యక్రమాల సమీక్షకు ఎన్జీవో తరఫున సంబంధిత బాధ్యత కలిగిన వ్యక్తికే అవకాశం ఉండాల్సి ఉండగా, ఇతరులు కూడా సమావేశాలకు హాజరవడం వల్ల తమ గోప్యతకు ముప్పు ఏర్పడుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కొంతమంది బాధితులను కార్యాలయానికి రావద్దంటూ సిబ్బంది ద్వారా చెప్పించారని కూడా వారు పేర్కొంటున్నారు,హ్యాండ్స్ ఎన్జీవో పరిధిలోని నాలుగు టీ-ఐ ప్రాజెక్టుల కోసం సోషల్ మీడియా కోఆర్డినేటర్‌ను నియమించారని, టీ-ఐ ప్రోగ్రాం రివ్యూ సమావేశాల్లో ఆయనను కూడా కూర్చోబెట్టి సున్నితమైన సమాచారాన్ని చర్చించారని బాధితులు ఆరోపిస్తున్నారు. సంబంధం లేని వ్యక్తిని టీ-ఐ గ్రూపుల్లో చేర్చి, సెక్స్ వర్కర్ల రిస్క్ బిహేవియర్‌తో పాటు హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తులకు సంబంధించిన గోప్యమైన వివరాలు చర్చించడం వల్ల తమ వ్యక్తిగత సమాచారం బయటకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు,టీ-ఐ కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులు, సపోర్టింగ్ డాక్యుమెంటేషన్ పేరుతో హెచ్ఐవీతో జీవిస్తున్న వారి ఫొటోలు తీస్తున్నారని కొంతమంది బాధితులు ఆరోపిస్తున్నారు. హ్యాండ్స్ ఎన్జీవో హెడ్ఆఫీస్‌లో పనిచేస్తున్న అకౌంటెంట్ భాగ్యలత టీ-ఐలకు సంబంధించిన అకౌంట్స్‌ను పరిశీలించే అధికార పరిధిపై కూడా బాధితులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు, ఫొటోలు తీసుకోవడం వల్ల తమ హెచ్ఐవీ స్థితి ఇతరులకు తెలిసిపోయే ప్రమాదం ఉందని, ఆ ఫొటోలను చూపిస్తూ సంస్థకు అనుకూలంగా మాట్లాడాలని, తాము చెప్పినప్పుడు సమావేశాలకు రావాలని ఒత్తిడి చేస్తున్నారని కొంతమంది బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై




సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల గోప్యత, గౌరవం, వ్యక్తిగత హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని బాధితులు పేర్కొంటున్నారు. తమకు జరిగిన అన్యాయంపై ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి స్వతంత్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు,అదేవిధంగా టీ-ఐ కార్యక్రమాల్లో కేవలం సంబంధిత అధికారులకు మాత్రమే అవసరమైన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని, హెచ్ఐవీతో జీవిస్తున్న వారి వ్యక్తిగత వివరాలు, ఆరోగ్య సమాచారం, ఫొటోలు అనధికారికంగా ఇతరులకు చేరకుండా కఠినమైన గోప్యతా నిబంధనలు అమలు చేయాలని బాధితులు కోరుతున్నారు

# నులిపురుగుల నివారణ దినోత్సవంపై మండల స్థాయి సమీక్ష సమావేశం



**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 22, మనంన్యూస్:**
సెప్టెంబర్ 25వ తేదీన నిర్వహించు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బుక్కరాయసముద్రం ఎంపీడీవో కార్యాలయం నందు మండల అభివృద్ధి అధికారి సాల్మన్ రాజ్ అధ్యక్షతన మండల కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించడం అయినది .ఈ సమావేశమీ నకు వైద్యాధికారి తెహరున్నిస, ఇందిర ప్రియ దర్శిని, మండల విద్యాశాఖ అధికారులు నవీద, మరియు లింగా నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ కౌసల్య హాజరైనారు. ఈ సందర్భంగా వైద్యాధి కారి తేహరున్నిస మాట్లాడుతూ సెప్టెంబర్ 25 వ తేదీన మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రంల లో 1 నుండి 5 సంవత్సరంల పిల్లలకు అలాగే ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల మరియు కళాశాలలందు 6 నుండి 19 సంవత్సరంల పిల్లల కు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేయబడును. ఆరోజు గైర్హాజరైన అయిన వారికి తిరిగి అక్టోబర్ నెల 5వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వబడును. మండల వ్యాప్తంగా 15,752 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయబడును అని తెలిపారు. మండల అభివృద్ధి అధికారి సాల్మన్ ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ మరియు ఐసిడిఎస్సూపర్వైజర్వారికి అందజేయడం అయినది. మండల వ్యాప్తంగా ఉపాధ్యాయు లందరూ సెప్టెంబర్ 25 వ తేదీన తమ పాఠశాల యందు మధ్యాహ్నం భోజనము తరువాత పాఠశాల పిల్లలందరికీఆల్బెండజోల్ మాత్రలు అందించేలాగ చూడవలసినదిగా మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ నకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మోహన్ రావు, మోహన్ బాబు, పీహెచ్ఎన్ నాగలక్ష్మి, సూపర్ వైజర్స్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా ప్రక్రియపై అబ్జర్వర్ ఆరా

- మందలపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో విస్తృతంగా పరిశీలన



**గోరంట్ల సెప్టెంబర్ 22 మనంన్యూస్** : ఓటరు జాబితా తయారీ, సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిం చేందుకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ శ్రీనివాసులు ( ఐఏఎస్ ) శ్రీ సత్యసాయి జిల్లా పర్యటనకు విచ్చేశారు. పర్యటనలో భాగంగా బెంగళూరు విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి వస్తున్న క్రమంలో గోరంట్ల మండలం మందలపల్లి స్వర్ణ గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రక్రియను పరిశీలించారు. పెనుకొండ డివిజనల్ రెవెన్యూ అధికారి,మండల తహసీల్దార్ తో కలిసి సచివాలయంలో ఓటరు జాబితా సవరణ, నమోదు ప్రక్రియకు సంబంధించిన వివరాలను అబ్జర్వర్ పరిశీలించారు. ఇప్పటివరకు జాబితా నుంచి తొలగించిన ఓట్ల సంఖ్య ఎంత, కొత్తగా ఎంతమంది ఓటర్లను నమోదు చేశారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ద్వంద్వ ఓట్ల వివరాలు ఎన్ని ఉన్నాయి, ఓటర్ల పేర్లు, ఇతర వివరాల్లో ఎన్ని మార్పులు చేశారు అనే అంశాలపై అధికారులను ఆరా తీశారు. అలాగే కొత్త ఓటర్ల నమోదు కోసం అందిన దరఖాస్తులు, ఓటర్ల వివరాల మార్పులు, తొలగింపులు, ద్వంద్వ నమోదుల గుర్తింపు, సవరణ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఓటరు జాబితా ప్రక్రియలో నిబంధనలను పాటిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా ద్వంద్వ నమోదులను గుర్తించి తగిన చర్యలు తీసుకునేలా అధికారులు చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డివిజనల్ రెవెన్యూ అధికారి ఆనంద్ కుమార్, గోరంట్ల మండల తహసీల్దార్ మధు నాయక్, రెవెన్యూ సిబ్బంది, స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# తాళాలు వేసిన ఇల్లు కాదు మనుషులు ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగలు

**గుంతకల్లు, సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** గత రెండు నెలల నుంచి కసాపురం రోడ్డు ప్రజలకు నిద్రాహారాలు కూడా కరువయ్యాయి. దొంగల బీభత్సంతోప్రజలు నిద్రను మానుకున్నారు ఎప్పుడు వచ్చి పడతారో అని రాత్రిళ్ళు మేలు కుంటూ పడిగాపులు కాస్తున్నారు. ఏమిటిది ఆధునిక ప్రపంచంలో ఉన్నామా లేక 100 సంవత్సరాల వెనక్కి వెళ్లిపోయామ. అదు నాతనమైన గూగుల్ వంటి మ్యాపులు సెల్ ఫోన్లు చేతిలో ఉండగా సిసి కెమెరాలు కూడా ఉండగా దొంగలు యదేచ్ఛగా ఇళ్ల పైన దాడులు చేస్తున్నారు .అడిగే నాధుడు లేకుండా పోయింది పోలీసులకే సవాళ్లు విసురుతున్నారు. కసాపురం పోలీస్ స్టేషన్లో మెన్ కొరత ఉందంటూ పోలీస్ ఉన్నతాధికారులు చెప్పుకొస్తున్నారు. అయినా రాత్రి వేళల్లో గస్తీ తిరుగుతున్నామంటూ వారు చెబుతు న్నారు. గత రెండు నెలల నుంచి నాయి బ్రాహ్మణ కాలనీ గౌడ్ కాలనీ జర్నలిస్టు కాలనీ అంజలి నగర్ తో పాటు కోయ నగర్ లోని ఓ ఇంట్లో భారీ దొంగతనం చేశారు. సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఉద్యోగైన ఆయన పని నిమిత్తం హైదరాబాద్ వెళ్ళగా ఇంట్లో భార్య ,పాప ఆయనతల్లిఉండగా సాయంత్రంవేళల్లో ముసుగులు ధరించి చేతికి బ్లౌజులు వేసుకుని ఇంటి వెనుక భాగం నుంచి వచ్చి ముగ్గురు దొంగలు కత్తితో బెదిరించి నలభై లక్షల విలువైన బంగారు నగలు రెండు లక్షల నగదు తీసుకునివెళ్ళిపోయారు. ఏమిటి పరిస్థితి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో కసాపురం రోడ్డు నివాసం ఉంటున్న ప్రజలు. తల్లడిల్లి పోతున్నారు ఊరికి వెళ్లాలన్నా భయమేస్తుంది. తాళాలు వేసి ఇల్లు కాదు మనుషులు ఉన్న ఇలాగే గురి పెడు తున్నారు. పోలీస్ ఉన్నతాధికా రూలు విషయాన్ని సీరియస్ గా తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





# శ్రీ సత్యసాయి జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓగా సమత

ఈ నెల 25 నుంచి కొత్త బాధ్యతలు.. ప్రభుత్వం ఉత్తర్వులు



**పుట్టపర్తి సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** ఈ నెల 25 నుంచి కొత్తగా ఏర్పాటు కానున్న శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్కు డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా (డిప్యూటీ సీఈఓ) సమత నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా పంచాయతీ అధికారిగా (డీపీఓ) విధులు నిర్వహిస్తున్న సమతను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 25నుంచిఆమె కొత్త బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఈమె డీపీఓగా విధులు మరియు ఈ నెల 25 నుంచి జెడ్పీ డిప్యూటీ సీఈఓగా బాధ్యతలు నిర్వహించనున్నారు

# పెద్దవడుగురు మండలా న్ని కరువు మండలంగా ప్రకటించాలి



**పెద్దవడుగూరు సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** పెద్దవడుగూరు మండలాన్ని ప్రభుత్వం తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని మండల బిజెపి అధ్యక్షులు దే వన రమేష్ రెడ్డి. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సుంకి రెడ్డి ఆధ్వర్యంలో మండల తాసిల్దార్కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపా ధ్యక్షులు సుంకిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎల్ నీనో తీవ్రత ప్రభావం వల్ల మండలం వ్యాప్తంగా వర్షాలు కురవక సాగు పంటలు అయినా పత్తి వేరుశనగ జొన్న కంది తదితర పంటలు ఎల్ నీనో. ప్రభావం వల్ల మండల వ్యాప్తంగా. సాగు పంటలన్నీ ఎండిపోయాయని పంట చేతి కిందక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేటట్లు లేదని బ్యాంకుల నుంచి పంట సాగుకు తెచ్చిన అప్పులు కట్టలేని స్థితిలో రైతులు ఉన్నారని కనుక వ్యవ సాయ రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ప్రకటించి అలాగే నష్టపరిహారం రైతుల ఖాతాలో జమ చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని. అలాగే ఒకే దప రైతులకు రెండు లక్షల వరకు రుణ.మాఫీ చేయాలని. బిజెపి పార్టీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలం లో వివిధ గ్రామాలనుంచి వచ్చే స్థానికులకు. మరు గుదొడ్లు లేక. బ్యాంకుల దగ్గర బస్టాండ్ సమీపాన. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని. కనుక బ్యాంకుల దగ్గరబస్టాండులో ప్రభుత్వముమరుగుదొడ్లు ఏర్పా టుచేయాలని ప్రభుత్వాన్నికోరారు.. ఈ కార్యక్రమం లో కిషన్ మోర్చా జోనల్ ఇంచార్జి తెగదోడి తిమరెడ్డి విద్యుత్ జిల్లా మోర్చా అధ్యక్షులు ఎం రామాంజినేయులు కిషన్ మోర్చా అధ్యక్షులు బి. విరారెడ్డి అనంతరామకృష్ణరెడ్డి శ్రీనివాసులు రామా ంజినేయులు శేషనందరెడ్డి వెంకటేశ్వర్లు పూల కృష్ణ మూర్తిసురేష్ వెంకటరామిరెడ్డి శివారెడ్డి అజయిరెడ్డి బిజెపి పార్టీ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

# ప్రత్యేక అలంకరణలో శ్రీ తుమ్మల మారమ్మ దేవత

**గుడిబండ సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** గుడిబండ మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో పురాతన కాలం నాటి నుండి నేటి వరకు ప్రత్యేక పూజలు అందుకుంటున్న శ్రీ తుమ్మల మారమ్మ దేవత మంగళవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చింది. వింతగా కనిపించే రంగు రంగుల పూలహారలతో అలంకరించడంతో అమ్మవారు చూడముచ్చటగా దర్శనమిచ్చింది. కరగా అలంకారంలో ఎంతో సుందరంగా అమ్మవారు దర్శన మిచ్చారు. భక్తుల కోరికలు తీర్చే దేవతగా విరాజిల్లుతో సుదూర ప్రాంతాల భక్తులను కూడా ఆకర్షించే దేవతగా అమ్మవారి నిలిచారని అర్చకులు తిప్పేస్వామి తెలిపారు. అమ్మకు కుడివైపు ఎడవైపులా కామక్క, కావలమ్మ అనే చిన్న దేవతలు కూడా ఎంతో అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.





# గుంతకల్లును మోడల్ సిటీగా చేస్తా

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు, సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** గుంతకల్ పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా నని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం 39 కోట్ల నిధులతోఅభివృద్ధి పను లకుఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా అయినప్పటి నుంచి ఇప్పటివరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా నని ఇందులో భాగంగా గుంతకల్లు పట్టణాన్ని మోడల్ సిటీగా మారుస్తానన్నారు అందుగ్గాను 39 కోట్ల నిధులను పట్టణ అభివృద్ధికి కేటాయించారు. పట్టణాన్ని ఎన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోతా మన్నారు అర్బన్ చాలెంజ్ పండు ద్వారా 39 కోట్ల నిధులు పట్టణ అభివృద్ధికి కేటాయిస్తా మన్నారు. పట్టణములో ఇంటింటికి నీటి కొలువైన ఏర్పాటు చేస్తున్నామని. మురికి కాలువల వ్యవస్థను మరింత విస్తరిస్తామన్నారు సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా వేగంగాజరుగుతున్నాయని ముఖ్యంగాకొన్ని కోడలు నూతనరోడ్డుపనులుకూడాజరుగుతున్నా యన్నారు. పట్టణాన్ని అత్యంత అందంగా వీధి దీపాలతో అలంకరించామన్నారు. కార్యక్రమంలో మండల ఇన్చార్జిగుమ్మనూరు నారాయణస్వామి, మునిసిపల్ కమిషనర్లక్ష్మీదేవి, డిప్యూటీ డి ఈ నీలంహరికృష్ణ, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా హిరేతుర్పి ఎస్సి కాలనీ గణేష్ నిమజ్జనం

### ముఖ్య అతిథిగా టీడీపీ నాయకుడు కసాపురం చిత్తయ్య యాదవ్



**మడకశిర, సెప్టెంబర్ 22,మనంన్యూస్:** హిరేతుర్పి గ్రామంలోని ఎస్సీ కాలనిలో ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ నిమజ్జనం కార్యక్రమంను నిర్వాహకులు సోమవారం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ నాయకుడు కసాపురం చిత్తయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన విగ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపించి మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం స్వీకరించారు. తమ ఆహ్వానం మన్నించి గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న చిత్తయ్య యాదవ్ కు ఎస్సీ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## అంగరంగా అత్యంత వైభవంగా శ్రీ తుమ్మల మారమ్మ జాతర మహోత్సవం



### - హారతులు దీపాలతో ఊరేగిన భక్తజనులు

**గుడిబండ, సెప్టెంబర్ 22,మనంన్యూస్:** మండల కేంద్రమైమ గుడిబండ గ్రామ దేవత శ్రీ తుమ్మలమారమ్మ జాతర మహోత్సవం ను అంగరంగా అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు.భద్రపద మాసం రెండవ మంగళవారం జాతర మహోత్సవంలో భాగంగా ఉదయం అమ్మ వారికి వివిధ భిషేకములు, పంచామృ తభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలు, పూలమాలలుతో ప్రత్యేక అలంకరణ చేసి,కరగా రూపంలో భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం దక్కడం విశేషం. దేవస్థానం ప్రధాన పూజరప్ప తిప్పేస్వామి చేతులు మీదుగా మహా మంగళ హారతి,తీర్థ ప్రసాదం వితరణ చేసారు. అమ్మ వారి జాతర మహోత్సవం సందర్భంగా గుడిబండ గ్రామంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల భక్తులు, మహిళలు హారతులు (దీపాలు)తో ఊరేగి దేవాలయం చుట్టు ప్రదిక్షణలు చేసి శ్రీ తుమ్మల మారమ్మకు అర తులు సమర్పించిన భక్తులు తమ మొక్కుబడిని తీర్చుకున్నారు. తమకోర్కెలను తీర్చినఅమ్మవారికి కృతజ్ఞతగా భక్తులకు విందు భోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ ప్రాంత వాసులే కాకా ఉమ్మడి అనంతపురంజిల్లా,కర్ణాటకలోనివివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ధర్మవరం అభివృద్ధికి రూ.43 కోట్ల హ్యామ్ పనులు



**ధర్మవరం, సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** సెప్టెంబరు 22: ధర్మవరం పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.43 కోట్లతో చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా ధర్మవరం పనులకు కూడా ప్రారంభమైంది.ధర్మవరం పట్టణంలోని శ్రీ మారుతి రాఘవేంద్ర కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, మున్సిపల్ ఈఈ సాయికృష్ణ, డీఈలువీరేష్,ప్రభాకర్‌దాస్, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ హ్యామ్ కింద మంజూరైన రూ.43 కోట్లతో పట్టణంలో రహదారులు, డివైడర్లు, పార్కులు, వీధిదీపాలు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ఇందులో సుమారు 25 కి.మీ. మేర సీసీ రోడ్లు, 2 కి.మీ. మేర బీటీ రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. రహదారులతో పాటు డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కులు, వీధిదీపాలఅభివృద్ధికిప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులతో పట్టణ మౌలిక వసతులు మెరుగుపడి ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకివస్తాయనితెలిపారు.మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు ధర్మవరం పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు హరీష బాబు చెప్పారు. హ్యామ్ పనులు పూర్తయితే పట్టణ రూపురేఖలుమరింతమారనున్నాయని పేర్కొన్నారు.



## నేటి నుండి 80 శాతం సబ్సిడీపై ఉలవల పంపిణీ

**నల్లచెరువు సెప్టెంబర్ 22 మనంన్యూస్:** మండలంలోని రైతులకు 80 శాతంసబ్సిడీపై ఉలవలను బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవ సాయ అధికారి లక్ష్మి ప్రియ తెలిపారు.మండలంలోని ఏడు రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)పరిధిలో మొత్తం240 క్వింటాళ్లఉలవలను కేటాయించినట్లు వెల్లడించారు.రైతులు తమకు సంబంధించిన రైతు సేవా కేంద్రానికి పట్టాదారుపాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు.ఉలవల క్వింటాల్ పూర్తి ధర రూ.7,400 కాగా, 80 శాతం సబ్సిడీ అనంతరం రైతు చెల్లించాల్సిన ధర రూ.1,480గా నిర్ణయించారు. 10 కిలోల ఒక బ్యాగ్‌కు రైతు వాటా రూ.148గా ఉంటుందని అధికారులు తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## రొళ్ల అగళి మండలాలకు న్యాయం చేయాల్సిందే

- ఆ రెండు మండలాలను కరువు మండలాల జాబితాల్లోకి చేర్చాల్సిందే
- నేడు వైసీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌లకు వినతి
- రొళ్ల జడ్పీటీసీ అనంతరాజు



**మడకశిర, సెప్టెంబర్ 22,మనంన్యూస్:** రొళ్ల, అగళి మండలాలకు ప్రభుత్వం తగిన న్యాయంచేసి ఆ రెండు మండలాలను కరువు మండలాల జాబితాల్లో చేర్పించి రైతంగాన్ని ఆదుకోవాలని కోరుతూ నేడు బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో ఆ రెండు మండలాల తహసీల్దార్లకు వినతి పత్రం అందించ నున్నట్లు రొళ్ల జడ్పీటీసీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బి. అనంతరాజు తెలిపారు. మంగళవారం అయన విలేకరులతో మాట్లాడుతూ కరువు కాటకాలకు నిలయమైన మడకశిర నియోజకవర్గంలోని 5 మండలాల్లో కూడా గతంలో ఎన్నడూకూడా లేని విదంగా ఈ సారి వర్షాలు లేక తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం రొళ్ల, అగళి మండలాలను కరువు మండలాల జాబితాలోకి చేర్చక పోవడం అతి దారుణమన్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ఆ రెండు మండలాల రైతులకు, ప్రజలకు అండగా పోరాటం చేసేదిశగా నేడు బుధవారం రొళ్ల, అగళి మండలాల్లో వైసీపీ ఆధ్వర్యశీలో తహసీల్దార్లకు వినతి పత్రం అందించి ఆ రెండు మండలాలను కరువు మండలాల జాబితాల్లోకి చేర్పించెంత వరకు నిరసనలు, ఆందోళనలు,పోరాటానికిసిద్ధం అవుతామని జడ్పీటీసీ స్పష్టం చేసారు. కావున నేడు ఆయా మండలాల్లో వైసీపీ శ్రేణులు, జగనన్న సైనికులు అధిక సంఖ్యలోతరలిరావాల్సిందిగాఅనంతరాజు కోరారు.

## విద్యార్థులను పలకరించిన మంత్రి నారా లోకేష్

### మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా...

**ధర్మవరం సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** రాప్తాడు పర్యటన ముగించుకుని పుట్టపర్తి విమానాశ్రయానికి వెళ్తున్న మంత్రి నారా లోకేష్ ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద తన కాన్వాయ్‌ను నిలిపారు. పాఠశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులను చూసిన మంత్రి లోకేష్ వారిని ఆప్యాయంగా పలకరించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడిన మంత్రి.. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యా బోధన తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు.విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని అధికారులను మంత్రి సూచించారు. మంత్రి అకస్మాత్తుగా పాఠశాల వద్ద ఆగితమతో మాట్లాడటంతోవిద్యార్థులు ఆనందంవ్యక్తం చేశారు




## వాల్మీకి వరసిద్ధి వినాయకునికి విశేష పూజలు



### ప్రత్యేక పూజలో మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి వైసీపీ శ్రేణులు

**మడకశిర, సెప్టెంబర్ 22,మనం న్యూస్:** మడకశిర పట్టణంలోని వాల్మీకి వరసిద్ధి వినాయకుడికి మంగళవారం విశేషపూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి శ్రీ విగ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపించారు. మహా మంగళ హారతి, తీర్థప్రసాదం స్వీకరించారు. మడకశిర పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి వరసిద్ధి వినాయక సేవా సంఘం ఆహ్వానం మేరకు వారు గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.అనంతరం వాల్మీకి వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యేతో పాటు, వైసీపీ శ్రేణులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్ఇసి సభ్యుడు వైసి గోవర్ధన్ రెడ్డి,మడకశిర నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి ఈరలక్కప్ప,రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సంయుక్త కార్యదర్శి జయరామ్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నాగరాజ్ గౌడ్,పట్టణ ఉపాధ్యక్షుడు గోపి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధను, పట్టణ ప్రచార విభాగం అధ్యక్షుడు రఘునందన్, పట్టణ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ రెడ్డి గౌడనాహల్లి మాజీ సర్పంచ్ హనుమంతే గౌడ్, వాల్మీకిసంఘంఅధ్యక్షుడువాల్మీకి మోహన్ కుమార్, వాల్మీకి సంఘం కమిటీ సభ్యులు కుళ్లాయప్ప, ఓబులేశు, మాదవరాజు, నాగరాజు, రాధాకృష్ణ ,కదిరి నరసింహులు పట్టణ సీనియర్ నాయకులు సూరంగాల నాగరాజు,చంద్ర నరసింహప్ప సుధా అన్వేష్, నవీన్ తదితరులు భక్తులు పాల్గొన్నారు.

# మంత్రివర్యా... మన నియోజకవర్గ కాలనీల్లో ఈ పరిస్థితి...!

▪ పోతుల నాగేపల్లి కాలనీలో అధ్వానంగా మౌలిక వసతులు ▪ వర్షం వస్తే రోడ్లపై నీరు.. పాచి పట్టిన ట్యాంకుల నుంచే తాగునీరు



**ధర్మవరం సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** ధర్మవరం పట్టణ పరిధిలోని పోతుల నాగేపల్లి కాలనీలో మౌలిక వసతులు అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలోని రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.

పాచి పట్టిన ట్యాంకులు.. తప్పని తాగునీటి కష్టాలు... కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులు సక్రమంగా నిర్వహణ లేక పాచి పట్టి అపరిశుభ్రంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో వాటిలో నిల్వ ఉన్న నీటిని వినియోగించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో అదే నీటిని తీసుకువచ్చి తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి...కాలనీలో నెలకొన్న సమస్యలపై మునిసిపాలిటీ అధికారులు, మండల పరిషత్ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో పారుదల సౌకర్యాలు ఏర్పాటు చేయడంతోపాటు





రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే తాగునీటి ట్యాంకులను వెంటనే శుభ్రం చేసి, సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇన్ని సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోతుల నాగేపల్లి కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ

– అగలి ఏఓ నాగరాజు

**అగళి, సెప్టెంబర్ 22,మనంన్యూస్:** వర్షభావ పరిస్థితులు కారణంగా ప్రత్నామయ పంట సాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అగళి మండలం మధూడిలో 80 శాతం రాయితీతో కూడిన ఉలవలను మంగళవారం పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు అగళి మండల వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ అగలి మండలానికి 300 క్వింటాళ్ళు ఉలవలు రావడం జరిగిందన్నారు. నేటినుండి మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో కూడా రైతులకి ఉలవలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 10 కేజీల బస్తా పూర్తి ధర రూ 740 కాగా 80% రాయితీ రూ 592 పోను రైతు వాటా 20 శాతం అనగా రూ 148 చెల్లించి 10 కేజీల బస్తాన్ని తీసుకోవచ్చన్నారు.ఉలవలు పంట పప్పు ధాన్యాలకి సంబంధించింది కాబట్టి దీన్ని వేయడం ద్వారా నేలలో నత్రజని శాతం అనేటువంటిది పెరుగుతుందన్నారు.అదేవిధంగా నేలల్లో ఉండే వివిధ రకాల పోషకాలు కూడా మొక్కకు లభ్యమయ్యే అవకాశం పెరిగి నేల సారం కూడా పెరుగుతుందన్నారు. కాబట్టి అవసరమైన రైతులు మాత్రమే ఈ ఉలవలను తీసుకొని పంట వేసి ఈ పంట నమోదు చేసుకోవాల్సిందిగా ఏఓ నాగరాజు



కోరారు. అదేవిధంగా సీడ్ తీసుకొని వేయకపోతే ప్రభుత్వం నుంచి వచ్చేటటువంటి పథకాలకి అనర్హులు అయ్యే అవకాశం ఉంది కాబట్టి నిజంగా అవసరమైన రైతులు మాత్రమే తీసుకొని పంటలు వేసి నేలను సారవంతం చేసుకోవాల్సిందిగా అయన తెలిపారు.ఈ అవకాశంను మండలంలోని రైతులుసద్వినియోగం చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి నాగరాజు కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మధుడి తిప్పేస్వామి, తదితర ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన జర్మనీకి పరిశోధకులు

బత్తలపల్లి మండలంలో కేఎఫ్‌డబ్ల్యూ పరిశోధకుల క్షేత్ర సందర్శన



**బత్తలపల్లి, సెప్టెంబర్ 22 మనంన్యూస్:** జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ పరిశోధకుల బృందం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. మంగళవారం కేఎఫ్‌డబ్ల్యూ సెక్టార్ ఎకనామిస్ట్ ఐరిస్ హార్డర్, కేఎఫ్‌డబ్ల్యూ న్యూఢిల్లీ సీనియర్ ఎన్ఆర్ఎం స్పెషలిస్ట్ సంగీత అగర్వాల్, రైస్ఎస్ సీనియర్ కన్సల్టెంట్ జి. మురళి, సీటీ అండ్ ఐఏ, డీపీఎం లక్ష్మానాయక్, ఎస్‌టీఎల్ జలాల్ బాషా ఉద్దీన్ బాషా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం (అంగ్రవు) బృందం ఈ పర్యటనలో పాల్గొన్నారు.నేత్తివారంపల్లి గ్రామంలో పరిశోధనా ప్రదేశాన్ని బృందం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వేరుశనగ సాగు చేస్తున్న నారాయణస్వామి, రసాయన వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న గంగరాజుతో బృంద సభ్యులు మాట్లాడి సాగు విధానాలు, పంట నిర్వహణ, పెట్టుబడులు, దిగుబడులు తదితర అంశాలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం మరియు రసాయన వ్యవసాయ విధానాలపై రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం బృందం ఉప్పరపల్లి గ్రామంలోని మస్సర్ఫ్ పరిశోధనా ప్రదేశాన్ని సందర్శించింది. అక్కడ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు చేస్తున్న దివాకర్, రసాయన వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న ఒబన్నతో పరస్పరం మాట్లాడింది. సాగులో ఎదురవుతున్న సమస్యలు, అనుసరిస్తున్న పద్ధతులు, పంటల నిర్వహణ తదితర అంశాలపై రైతుల నుంచి వివరాలు సేకరించింది.ఈ సందర్భంగా బృందంతో కలిసి పరిశోధనా క్షేత్రాల్లో చేపడుతున్న అధ్యయనాలు,రైతులఅనుభవాలు,ప్రకృతి వ్యవసాయ విధానాలపై క్షేత్రస్థాయి పరిశీలనలు చేశారు.

# జగన్ అన్యాయం... చంద్రబాబు న్యాయం చేశారు

విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ నాయకుల వ్యాఖ్యలు

**ధర్మవరం సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** రాష్ట్రంలోని విశ్రాంతి ఉద్యోగులకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్యాయం జరిగిందని ధర్మవరం విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డీఏను పెంచి విశ్రాంతి ఉద్యోగులకు ఉపశమనం కల్పించారని వారు పేర్కొన్నారు. ధర్మవరంలో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఏకిలా చలపతి, కార్యదర్శి చిన్నప్ప, ఉపాధ్యక్షుడు శ్రీరాములు, కోశాధికారి సుధాకర్ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో డీఏ విషయంలో విశ్రాంతి ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వండీఏను పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో విశ్రాంతి ఉద్యోగులకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. డీఏను 7 శాతం నుంచి పెంచినందుకు ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడికి




వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా విశ్రాంతి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.విశ్రాంతి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఇదే విధంగా పరిష్కరిస్తూ, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలపై కూడా దృష్టి సారించాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

## ఘనంగా గ్రామ గ్రామాల్లో శ్రీ గౌరసంద్ర మారమ్మకు హారతి దీపాలు ఉత్సవం

– వర్షం రాకతో ఎంతో ఉత్సాహంతో ప్రత్యేక పూజలు



**అమరాపురం, సెప్టెంబర్ 22,మనంన్యూస్:** అమరాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం భక్తి శ్రద్దలతో శ్రీ గౌరసంద్ర మారమ్మకు హారతి దీపాలు మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి మండల వ్యాప్తంగా ఓ పదునైన వర్షం రాకతో ప్రజలు ఎంతో రెట్టింపు ఉత్సాహం, ఆనందంతో శ్రీ గౌరసంద్ర మారమ్మ హారతి ఉత్సవాలు నిర్వహించడం విశేషం. మండలంలోని అమరాపురంలో శ్రీ చోళమంభదేవికి హారతులు, గౌడనకుంట, దేవగానపల్లి,నాగవ్వనహళ్లి,మద్దనకుంట, పుల్లీకుంట, హలుకురు,హుదుగూరు, వీరాపురం,తదితర గ్రామాలలో శ్రీ గౌరసంద్ర మారమ్మకు హారతులు దీపాలు మహోత్సంను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బందువులకు, స్నేహితులకు, విందు భోజనాలు నిర్వహించారు. శ్రీ మారమ్మ జాతర మహోత్సవా ల్లో భాగంగా గ్రామాలలో ఎలాంటి అవంచనియా సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా దీపాలు జరుపుకునే విదంగా స్థానిక ఎస్ఐ ఎస్. వాలీబాషా, ఎఎస్ఐ వెంకటరమణ, తమ పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు చేపట్టారు.



## వడ్డెర్ల ఐక్యతతో అభ్యున్నతికి కృషి చేయాలి

– కుంచపు వెంకటేశులు – ఎమ్మెల్సీ రమాదేవికి ఘన సన్మానం



**అనంతపురం, సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** నగరంలోని ఎం.వై.ఆర్. ఫంక్షన్ హాల్‌లో దలవాయి రమాదేవి ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా దలవాయి రమాదేవి, దలవాయి వెంకటనారాయణ ఆధ్వర్యంలో కృతజ్ఞతా అభినందన, ఆత్మీయ సమావేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, వడ్డెర్ల సంఘం చైర్మన్ మల్లెల ఈశ్వర్, వివిధ రాష్ట్రాల నుంచి వడ్డెర సంఘం ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డెర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు మాట్లాడుతూ వడ్డెర్ల సమస్యలు, సంఘం ఐక్యత, భవిష్యత్తు కార్యాచరణపై తన అభిప్రాయాలను వెల్లడించారు.వడ్డెర్లంతా ఐక్యంగా ఉండి తమ హక్కులు, అభ్యున్నతికోసం సమష్టిగా కృషిచేయాలనిపిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వడ్డెర్లకు అండగా నిలిచి వారి సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం, అభివృద్ధి కోసం సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వడ్డెర సమాజం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన దలవాయి రమాదేవి, దలవాయి వెంకటనారాయణను వడ్డెర సంఘం నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. వడ్డెర్ల ఐక్యతను మరింత బలోపేతం చేసుకుంటూ సమాజ అభ్యున్నతికి అందరూ కలిసి పని చేయాలనినాయకులుపిలుపునిచ్చారు.కార్యక్రమంలోవేముల గోవిందరాజులు, వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి, వడ్డే శ్రీరాములు, సీనియర్ నాయకుడు, వడ్డే అంజలి, హిందూపురం తెలుగు మహిళా అధ్యక్షురాలు, వడ్డే హనుమప్ప, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పల్లవ రాజు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, పెనుకొండ లక్ష్మీదేవి, బూత్ ఇన్‌చార్జ్ కొట్టాలపల్లి సుధాకర్, బ్రహ్మయ్యతో పాటు పలువురు వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాణం కంటే ఏ పరీక్షా పెద్దది కాదు

ఐఐటీ బాంబే ఘటనలు చెబుతున్న గుణపాఠం.. మార్కులు, ర్యాంకుల ఒత్తిడిలో విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని విస్మరించొద్దు



**గాల్లదిన్నె, సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** ఐఐటీలో సీటు సాధించడం ఎంతోమంది విద్యార్థుల కల. అందుకోసం ఏళ్ల తరబడి కష్టపడతారు. రాత్రింబవళ్లు చదువుతారు. తల్లిదండ్రులూ ఎన్నో త్యాగాలు చేస్తారు. సీటు వచ్చిన రోజు ఇంట్లో పండగ వాతావరణం. కానీ.. అక్కడితో పోరాటం ఆగడం లేదు. చదువు, మార్కులు, ర్యాంకులు, ఉద్యోగం, వేతనం.. ఇలా ప్రతి దశలో ఒత్తిడి పెరుగుతూనే ఉంది.ఇటీవల ఐఐటీ బాంబేలో చోటుచేసుకున్న వరుస విషాద ఘటనలు విద్యార్థుల మానసిక ఒత్తిడిపై ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఏడు నెలల్లో ముగ్గురు విద్యార్థులు క్యాంపస్‌లోనే బలవన్మరణానికి పాల్పడ్డారన్న వార్తలు కలవరపెడుతున్నాయి. రెండో సంవత్సరం విద్యార్థి సాహిల్ వాకోడే మృతి కూడా విషాదాన్ని మిగిల్చింది. పరీక్షల్లో సెల్‌ఫోన్ వినియోగానికి సంబంధించిన వివాదం, అనంతరం కుటుంబ సభ్యులు చేసిన వివక్ష ఆరోపణలపై చర్చ జరుగుతోంది. దర్యాప్తు కొనసాగుతున్నందున పూర్తి వాస్తవాలు వెలుగులోకి రాకముందే ఒక నిర్ణయానికి రావడం సరికాదు.
అయితే ఈ ఘటన ఒక ప్రశ్నను మాత్రం ముందుకు తెస్తోంది. మార్కులు, ర్యాంకుల కంటే విద్యార్థి ప్రాణం విలువైనదే కదా?
ఇది ఒక్క ఐఐటీ సమస్య కాదు...విద్యార్థుల బలవన్మరణాలు ఒక్కో విద్యాసంస్థకు పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న పరిణామం.జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2024లో దేశవ్యాప్తంగా 14,488 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. 2023లో ఈ సంఖ్య 13,892. 2014లో 8,068గా ఉన్న ఈ సంఖ్య పదేళ్లలో గణనీయంగా పెరిగింది. మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థుల వాటా కూడా 2014లో 6.1 శాతం నుంచి 2024లో 8.5 శాతానికి చేరింది. ఈసంఖ్యలను కేవలంగణాంకాలుగా చూడకూడదు.ప్రతి సంఖ్యవెనుక ఒకకుటుంబం ఉంది. తల్లిదండ్రుల ఆశలు,కన్నీళ్లుఉన్నాయి. అయి తే.. బలవన్మరణాలకు ఒక్క కారణమే అని ఈ గణాంకాలు చెప్పవు. చదువు ఒత్తిడి, కుటుంబ సమస్యలు ,ఆర్థికఇబ్బందులు, అనారోగ్యం, సంబం ధాలు. .ఇలాఅనేక అంశాలు ప్రభావం చూపవచ్చు. ప్రతి ఘటననుఒకేకారణానికిముడిపెట్టడం సరికాదు.
ఒక్క పరీక్ష.. జీవితానికి తీర్పు కాదు...విద్యార్థి తప్పు చేస్తే క్రమశిక్షణ అవసరమే. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సిందే. కానీ.. దిద్దుకునే అవకాశం కూడా ఉండాలి.ఒక పరీక్షలో విఫలమైతే మరోసారి రాయొచ్చు. ఒక సబ్జెక్టులో తప్పితే మళ్లీ చదవొచ్చు. ర్యాంకు తగ్గితే మరోసారి ప్రయత్నించొచ్చు. ఉద్యోగం రాకపోతే మరో మార్గం వెతుక్కోవచ్చు.
కానీ.. ప్రాణం పోతే మాత్రం మరో అవకాశం ఉండదు...అందుకే విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో పాటు మానవీయత కూడా అవసరం. తప్పును గుర్తించాలి. కానీ ఆ తప్పే విద్యార్థి జీవితానికి ముగింపు కాకూడదు. సమస్య పరిష్కారంలో విద్యార్థి గౌరవం, భద్రత, మానసిక స్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.
'మార్కులుఎంత?' కాదు.. 'ఎలా ఉన్నావు?' విద్యార్థినిచూసినప్పుడు'ఎన్నిమార్కులు వచ్చాయి?', 'ర్యాంకు ఎంత?', 'ఏ ఉద్యోగం వస్తుంది?' అని అడుగుతాం. ఇవన్నీ ముఖ్యమే. కానీ.. 'నువ్వు ఎలా ఉన్నావు?' అన్న ప్రశ్న కూడా అంతే ముఖ్యం.చదువుపై ఆసక్తి తగ్గిందా? ఒంటరిగా ఉంటున్నాడా? స్నేహితులకు దూరమవుతున్నాడా? తరచూ భయపడుతున్నాడా? మౌనంగా ఉంటున్నాడా? ఇలాంటి మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలి.'నువ్వు సాధించాలి' అనే మాటతో పాటు.. 'నువ్వు విఫలమైనా మేమున్నాం' అనే భరోసా కూడా ఇవ్వాలి.
క్యాంపస్‌లో భరోసా పెరగాలి...విద్యార్థి తన సమస్యను చెప్పడానికి భయపడకూడదు. విద్యాసంస్థల్లో మానసిక సలహా, సహాయ సేవలు అందుబాటులో ఉండాలి. కౌన్సెలింగ్‌ను బలహీనతగా చూసే పరిస్థితి మారాలి. విద్యార్థుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకూడదు. క్రమశిక్షణ చర్యల్లోనూ మానవీయ కోణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. చదువులో ఇబ్బంది ఎదురైతే ఒంటరిగా భరించాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో, స్నేహితులతో మాట్లాడాలి. అవసరమైతే నిపుణుల సహాయం తీసుకోవాలి. సమస్యను చెప్పడం ఓటమి కాదు. సహాయం కోరడం బలహీనత కాదు. మళ్లీ ప్రయత్నించడం తప్పు కాదు.ఒక పరీక్ష ఫలితం మనిషి మొత్తం జీవితాన్ని నిర్ణయించదు. మార్కులు ఒక సంఖ్య మాత్రమే. ర్యాంకు ఒక గుర్తింపు మాత్రమే. ఉద్యోగం జీవితంలోని ఒక దశ మాత్రమే.విద్యార్థి మార్కుల కంటే విలువైనవాడు. ర్యాంకుల కంటే అతని జీవితం పెద్దది. పరీక్ష ఒక దశ మాత్రమే.. జీవితం అంతకంటే పెద్దది.చదువు జీవితాన్ని నిర్మించాలి.. జీవితాన్ని ముగించకూడదు.

**జి. అజయ్ కుమార్**

## నూతన విద్యార్థులకు స్వాగతం

ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి కుమార్




**మడకశిర, సెప్టెంబర్ 22,మనంన్యూస్:** ఉన్నత విద్య కమీషనర్ వారి ఆదేశాల మేరకు 2026-27 విద్యాసంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థిని, విద్యార్థులకు స్వాగత కార్యక్రమంనకు శ్రీకారం చుట్టినట్లు మడకశిర ఎస్ వై టి ఆర్ ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ దీనిలో భాగంగానే మడకశిరలో విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం 7 రోజులు పాటు వివిధ అంశాలపైన నూతన విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.అధ్యాపకుల పరిచయం, కళాశాల పరిచయం, నైతికవిలువలు, వ్యక్తిత్వవికాసం, సమాజం పట్ల అవగాహన వంటి అంశాలను బోధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమలత, అధ్యాపకులు అనిల్ కుమార్, చంద్రశేఖర్, సుబ్బారాయుడు ఇతర అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనంత మేయర్ సీటు బీసీలకు కేటాయించాలి

– మంత్రి నారా లోకేష్‌ను కోరిన జశ్వంత్ వ్యాస్





**అనంతపురం, సెప్టెంబర్ 22 మనంన్యూస్:** అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ సీటు తెలుగుదేశం పార్టీ తరపున బీసీ లకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ యువజన అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ మంత్రి నారా లోకేష్ ను కోరారు. రాప్తాడునియోజకవర్గంలోస్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం రాప్తాడు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ యువజన అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జశ్వంత్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అని, ఈ స్థానిక సంస్థల్లో మేయర్ సీటు బీసీలకు కేటాయించాలని విన్నవించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా శ్రీ వేద వ్యాస విగ్రహాలు ప్రధాన సర్కిళ్లలో ప్రతిష్టంప జేసి, శ్రీ వేద వ్యాస జయంతిని అధికారికంగా ప్రకటించాలని కోరారు.

## ప్రాణాలను కాపాడటమే మహోన్నతమైన సేవ

– ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు భాస్కర్ బాబు

**అనంతపురం, సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా అనంతపురం పాత ఊరులోని శ్రీ విశ్వకర్మ కళ్యాణ మండపంలో సవేరా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వీవీ భాస్కర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను చూసి భయపడకుండా, వ్యాధిని సకాలంలో గుర్తించి, సరైన వైద్యం పొందడంద్వారా మెరుగైనఫలితాలుసాధించవచ్చని వైద్యులు సూచించారు.ఈసందర్భంగా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్సపై అవగాహన కల్పించారు. ప్రజల ఆరోగ్యం కోసం ఒక అడుగు ముందుకు వేస్తే అది ఒక కుటుంబానికి భరోసాగా, ఒక ప్రాణానికి ఆశగా నిలుస్తుందని నిర్వాహకులు భాస్కర్ బాబు పేర్కొన్నారు. "ఆరోగ్యమేమహాభాగ్యం.. ఆరోగ్య పరిరక్షణే మనందరి బాధ్యత" అని ఆయన అన్నారు. కార్యక్రమంలో సవేరా హాస్పిటల్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.





## వైభవంగా ఖాద్రీశుని వారి వెండి రథము ఉత్సవము

వెండి పల్లకిలో భక్తులకు దర్శనం ఇచ్చిన నారసింహుడు



**కదిరి,సెప్టెంబర్ 22 మనంన్యూస్:** నవ నరసింహుని క్షేత్రములలో కెల్ల భక్త ప్రహ్లాద సమేతముగా స్వయంభూగా వేలశియున్న క్షేత్రము శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిఆలయము, చారిత్రాత్మకంగా వాసికెక్కిన ప్రశిద్దిమైన వైష్ణవ క్షేత్రం. భాద్రపద మాసం, పరివర్తన ఏకాదశి మంగళవారము రాత్రి 8.00 గంటల నుండి శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభుల స్వామి వార్లకు వెండి రథము ప్రాకరోత్సవమును (ఆలయ ప్రాకరోత్సవము) కార్యక్రమమును నిర్వహించడమైనది. వెండి రథము పైన కొలువు దీరిన స్వామి వారికి సుగంధ పుష్పాలతో, కదిరి మల్లెలు, తులసి మాలతో అలంకరణ గావించి, అస్థాన పూజలు నిర్వహించి అనంతరము తాళమేళాలతో ఆలయ ప్రాకరోత్సవము అత్యంత వైభవముగా నిర్వహించడమైనది. అనంతరము నివేదనగా ఉప్పుపొంగళి ప్రసాదము నివేదనగావించి పలు రకాలు పండ్లు సమర్పించి ప్రసాద వితరణ కార్యక్రమము నిర్వహించడమైనది. నదరు వెండి రథోత్సవమునకు భక్తులు కూడా విరివిగా పాల్గొని స్వామి వారి సేవలో తరించి అనుగ్రహము పొందినారు.



## వీఆర్ఏల నిరసనకు మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ సంఘీభావం

– న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి: నాయకులు



**పెనుకొండ సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16వ తేదీ నుంచి పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ నాయకులు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు ఎం.ఎన్. మూర్తి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల కన్వీనర్ కోనాపురం పెద్దన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లపల్లి నాగేంద్ర, జాయింట్ చైర్మన్ కురుగుంట గోవిందు తదితరులు నిరసన శిబిరాన్ని సంద ర్శించి వీఆర్ఏలకు మద్దతు తెలిపారు.ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వీఆర్ఏలు చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏడు రోజులుగా వీఆర్ఏలు నిరసన చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వీఆర్ఏల న్యాయమైన డిమా ండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే తమ కుల సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.రాష్ట్ర వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ పెనుకొండ మండల అధ్యక్షుడు టి. నరసన్న మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడు రోజులుగా ఆందోళన కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.నిరసన శిబిరంలోటి.నరసప్ప, అంజనప్ప, సుబ్బరాయుడు, పుల్లన్న, రాధమ్మ, చెన్నకేశవులు తదితర 24 మంది వీఆర్ఏలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నాయకులు, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రతినిధులు పాల్గొని వీఆర్ఏలకు సంఘీభావం తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయం భేష్

జర్మనీ ఆర్థిక సంస్థ కేఎఫ్ డబ్ల్యూ బృందం



**చిలమత్తూరు, సెప్టెంబర్ 22, మనం న్యూస్ :** మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ విధానం భేష్ గా ఉందని జర్మనీ బ్యాంకింగ్ రంగానికి చెందిన కేఎఫ్ డబ్ల్యూ ప్రతినిధులు కొనియాడారు. చిలమత్తూరు పంచాయతీ పాతచామలపల్లిలోని రైతులు అవలంభిస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని కేఎఫ్ డబ్ల్యూ ప్రతినిధుల బృందం మంగళవారం పరిశీలించింది. స్థానిక రైతులు అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం అమలు తీరు, రైతుల అనుభవాలు, కాంపాక్ట్ బ్లాక్‌లు, ఎఫ్పీఓ కార్యకలాపాలు, కేడర్ల పాత్రను తెలుసుకునేందుకు జర్మనీ పరిశోధన భాగస్వాముల బృందం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించింది. ఈ బృందంలో జర్మనీకి చెందిన ఐరిస్ హోర్డర్, సెక్టార్ ఎకనామిస్ట్ సంగీత అగర్వాల్, రిటైర్డ్ ఐఏఎస్ టి. విజయ్ కుమార్, సీనియర్ కన్సల్టెంట్ జి. మురళి, లక్ష్మానాయక్, జలాల్ బాషా ఉద్దీన్ బాషా, డా. నవీన్, రవిచంద్ర తదితరులు ఉన్నారు. పర్యటనలో గ్రామ పరిశీలన, ప్రకృతి వ్యవసాయం అమలు తీరు, రైతుల భాగస్వామ్యం, కేడర్ల కార్యకలాపాలపై బృందానికి వివరించారు. అనంతరం కేఎఫ్ డబ్ల్యూ బృంద ప్రతినిధులు రైతులను నేరుగా కలుసుకుని వారి అనుభవాలను తెలుసుకున్నారు. సంప్రదాయ వ్యవసాయం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఎలా మారారు, ఆ మార్పు సమయంలో ఎదురైన అనుభవాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించిన తర్వాత వచ్చిన మార్పులను రైతులు స్వయంగా వివరించారు. చివరిగా కృష్ణారెడ్డి రైతుకు చెందిన 0.50 ఎకరాల మల్బరీ ఏ గ్రేడ్ మోడల్‌ను బృందం సందర్శించింది. మల్బరీ సాగులో అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పంట నిర్వహణ, ఏ గ్రేడ్ మోడల్ అమలు విధానంపై రైతుతో నేరుగా చర్చించారు. రైతులతో నేరుగా సంభాషించడం ప్రకృతి వ్యవసాయం ద్వారా చోటు చేసుకుంటున్న మార్పులను తెలుసుకున్నారు. గ్రామంలో రైతులు చేస్తున్న ప్రకృతి వ్యవసాయంపై జర్మనీ ప్రతినిధుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.



# రూ.253 కోట్లతో రాయదుర్గం అభివృద్ధి

– ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ నిధులు సమీకరించి అభివృద్ధి పనులు చేపట్టాం: ఎమ్మెల్యే కాలవ





**రాయదుర్గం సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** ఎక్కడ అవకాశం ఉంటే అక్కడి నుంచి నిధులు సమీకరించి రూ.253 కోట్లతో రాయదుర్గం పట్టణ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. గత రెండేళ్లలో ఎన్నడూ లేనంతగా పట్టణంలో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. అభివృద్ధిని చూసి ప్రజలు తమను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. రాయదుర్గం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద రూ.30 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో రాయదుర్గం పట్టణ ప్రజలు తనను 16 వేలకుపైగా మెజారిటీతో గెలిపించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తనపై ఇంతటి ఆదరణ చూపిన ప్రజలకు పట్టణ అభివృద్ధి కోసం తాను ఎంత చేసినా తక్కువేనని అన్నారు. తనకు సాధ్యమైనంత మేరకు, అవకాశం ఉన్న ప్రతి చోట నిధులు సమీకరించి గత రెండేళ్లలో పట్టణ అభివృద్ధికి కీలకమైన పనులు చేపట్టామని వివరించారు. దశాబ్దాల తరబడి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న రాయదుర్గం పట్టణాన్ని రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలకు సమానంగా అభివృద్ధి చేస్తూ కొత్త పుంతలు తొక్కిస్తున్నామని తెలిపారు. గత రెండేళ్ల కాలంలోనే రూ.253 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా రూ.30 కోట్ల పనులకు శంకుస్థాపన చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గత రెండేళ్లలో జరిగినంత అభివృద్ధి రాయదుర్గం పట్టణంలో మునుపెన్నడూ జరగలేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, మంత్రి నారాయణ ముందు చూపుతో రాయదుర్గం పట్టణంలో మునుపెన్నడూ చూడని అభివృద్ధిని సాధించగలుగుతున్నామని తెలిపారు. రాయదుర్గం పట్టణంలో రూ.78 కోట్ల వ్యయంతో అమృత్–2 పథకం కింద తాగునీటి పథకం విస్తరణ పనులు చేపట్టామని చెప్పారు. అలాగే హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా రూ.30 కోట్లతోపాటు మరో రూ.30 కోట్లను సమీకరించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని వివరించారు. వీటితో పాటు వివిధ పథకాల కింద నిధులు సమీకరించి రాయదుర్గం పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్వచ్ఛ భారత్ నిధులను తీసుకొచ్చి దశాబ్దాలుగా పేరుకుపోయిన సుమారు లక్ష టన్నుల చెత్తను శుద్ధి చేస్తున్నామని తెలిపారు. పట్టణ శివారు ప్రాంతాల్లో రూ.2.50కోట్ల వ్యయంతో నగరవనాన్ని అభివృద్ధి చేశామని, రాబోయే ఐదేళ్లలో మరో రూ.25 కోట్లు ఖర్చు చేసి మరింత మెరుగైన సౌకర్యాలతో తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. ఆగిపోయిన రైల్వే వంతెన నిర్మాణానికి రూ.46 కోట్లు మంజూరు చేయించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన టిడ్కో బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఐదేళ్లపాటు ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.27 కోట్లతో పనులు పునః ప్రారంభించామని చెప్పారు. అలాగే రూ.3 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించామని, వీటితోపాటు రోడ్లు, మురుగుకాలువల నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. మరో 20 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు వేస్తున్నామని వివరించారు. ప్రజలు సాయంత్రం వేళల్లో తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేందుకు వీలుగా పట్టణంలోని పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ నిధులు సమీకరించి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాయదుర్గం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరారు. ప్రజల ఆశీర్వాదమే తమను మరింత బలోపేతం చేస్తుందని, తద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లభిస్తుందన్నారు. ప్రజల ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ తమపై ఉండాలని, మరిన్ని గొప్ప పనులు చేయడానికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేకాలవశ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అంబోజి రావ్, వసుంధర దేవి, సెంట్రల్‌స్టోర్ అధ్యక్షుడు పూజరి శివ, చేనేత మాజీ డైరెక్టర్‌టశీకశాలహనుమంతు, బంగి శంకర్, పైతోటరామంజి, మోపూరి అశోక్, సుమలత, ఉమ ,ఎల్లప్ప, రావుత్ రాజశేజర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# రాయితీ విత్తనాల పంపిణీలో మళ్లీ అక్రమాలకు తావివ్వరా..?

✦ ధర్మవరం మండలంలో ప్రత్యామ్నాయ విత్తనాల కేటాయింపు.. రైతుల్లో కొత్త ఆందోళన ✦ వ్యవసాయ అధికారులు లెక్కలు తప్పాయ్...



**ధర్మవరం సెప్టెంబర్ 22 మనం న్యూస్ :**
వేరుశనగ సాగుకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలు నిజమైన రైతుల చేతికి చేరేలా అధికారులు పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఖరీఫ్–2026లో ధర్మవరం మండలానికి ప్రత్యామ్నాయ విత్తనాల కింద వివిధ పంటలకు కేటాయింపులు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. అయితే గతంలో రాయితీ విత్తనాల పంపిణీ సందర్భంగా చోటుచేసుకున్నట్లు రైతులు చెబుతున్న అక్రమాల ఆరోపణలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. అధికారుల సమాచారం ప్రకారం ధర్మవరం మండలానికి ప్రత్యామ్నాయ విత్తనాల కింద ఉలవలు, అలసందలు, జొన్నలు, పెసలు తదితర పంటల విత్తనాలను కేటాయించారు. ముఖ్యంగా ఉలవల విత్తనాలకు 10 కిలోల బస్తా పూర్తి ధర రూ.740 కాగా, 80 శాతం రాయితీ తర్వాత రైతు చెల్లించాల్సిన మొత్తం రూ.148గా అధికారులు చెబుతున్నారు. వేరుశనగ సాగు చేసుకోలేని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా కొంత ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో, రాయితీ విత్తనాలు అర్హులైన రైతులకే చేరడం అత్యంత కీలకం.

గత అనుభవం.. ఇప్పుడు భయం...అయితే గతంలో రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ సమయంలో ఒక పంచాయతీ పరిధిలో రైతుల నుంచి వేలిముద్రలు తీసుకుని, వాస్తవంగా విత్తనాలు అందకుండా పెద్ద మొత్తంలో బస్తాలను ధర్మవరం పట్టణంలోని గోడౌన్‌లో నిల్వ చేశారనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక విచారణ నివేదిక లేదా బాధ్యులపై తీసుకున్న చర్యల వివరాలు ప్రజలకు స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవడం, ఆరోపణలు నిరాధారమైతే వాస్తవాలను ప్రజల ముందు ఉంచడం అధికారుల బాధ్యత. ఇప్పుడు అదే తరహా పరిస్థితి ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీలో పునరావృతం కాకూడదనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

వేలిముద్ర ఒక్కటే.. విత్తనం ఎక్కడ..?రైతు పేరుతో వేలిముద్ర తీసుకున్న తర్వాత విత్తనం వాస్తవంగా అందిందా? ఎన్ని బస్తాలు పంపిణీ చేశారు? ఎవరికి ఇచ్చారు? రైతు చెల్లించిన మొత్తం ఎంత? మిగిలిన స్టాక్ ఎంత? వంటి వివరాలు స్పష్టంగా నమోదు కావాలి. రైతు వేలిముద్రను తీసుకోవడం పంపిణీకి సాక్ష్యంగా మాత్రమే కాకుండా, వాస్తవంగా విత్తనం రైతు చేతికి చేరిందనే ధృవీకరణకు కూడా ఉపయోగపడాలి. అదే సమయంలో గ్రామాల వారీగా కేటాయించిన పరిమాణం, లబ్ధిదారుల జాబితా, పంపిణీ తేదీలు, మిగిలిన నిల్వల వివరాలను బహిరంగంగా ప్రకటిస్తే అనుమానాలకు తావుండదు.

పర్యవేక్షణ ఎక్కడ...?రాయితీ విత్తనాల పంపిణీ వంటి రైతు సంక్షేమ కార్యక్రమాల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణ బలహీనంగా ఉంటే మధ్యవర్తులకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉంది. అందువల్ల వ్యవసాయశాఖ అధికారులు కేవలం కాగితాలపై పంపిణీ పూర్తయిందని చూపించకుండా, వాస్తవంగా రైతుల పొలాలకు విత్తనాలు చేరాయా లేదా అన్నదానిపై దృష్టి పెట్టాలి. అనంతపురం జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల విత్తనాల సరఫరా, ముఖ్యంగా ఉలవలు–కొర్రలకే సరఫరా పరిమితమవుతున్నదన్న అంశంపై ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి.

అధికారులకు రైతుల ప్రశ్నలు

గ్రామాల వారీగా ఎంత విత్తనం కేటాయించారు?అర్హత కలిగిన రైతుల జాబితా ఎక్కడ?,ప్రతి రైతుకు ఎన్ని బస్తాలు ఇచ్చారు?రైతు చెల్లించిన మొత్తానికి రసీదు ఇస్తున్నారా?వేలిముద్ర తీసుకున్న ప్రతి రైతుకు విత్తనం అందిందని అధికారులు ధృవీకరించగలరా?పంపిణీ అనంతరం మిగిలిన విత్తన నిల్వ ఎంత?గతంలో వచ్చిన అక్రమాల ఆరోపణలపై ఏమైనా విచారణ జరిగిందా? గోడౌన్లలో నిల్వ ఉన్న విత్తనాలపై అధికారులు భౌతిక తనిఖీలు చేశారా?ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇస్తేనే రైతుల్లో నెలకొన్న అనుమానాలు తొలగుతాయి.

పారదర్శకతే పరిష్కారం...రైతులకు అందాల్సిన రాయితీ విత్తనాలు ఎక్కడా దారి మళ్లకుండా ఉండేందుకు గ్రామాల వారీగా, రైతుల వారీగా పంపిణీ వివరాలను బహిరంగ పరచడం, పంపిణీ కేంద్రాల్లో అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఏర్పాటు చేయడం, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేయడం, రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వడం వంటి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం రైతుల కోసం కేటాయించిన సబ్సిడీ ప్రజాధనం. కాబట్టి ఆ ప్రయోజనం చివరి రైతు వరకు చేరేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖఅధికారులపైఉంది. రైతుల వేలిముద్రలు తీసుకుని విత్తనాలు ఇవ్వకపోతే అది కేవలం పంపిణీ లోపం కాదు– రైతు హక్కుకు భంగం. అందువల్ల ఈసారి అలాంటి ఆరోపణలకు అవకాశం లేకుండా అధికారులు ముందుగానే కఠినమైనపర్యవేక్షణ వ్యవస్థనుఏర్పాటు చేయాలి. ధర్మవరం మండలంలోప్రత్యామ్నాయ విత్తనాలపంపిణీ ప్రారంభమయ్యే ముందు నుంచే జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి, "అర్హుడైన ప్రతిరైతుకు విత్తనం.. ఒక్క బస్తా కూడా పక్కదారి పట్టకుండా" అనే విధంగా పారదర్శక వ్యవస్థను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో వినియోగదారుల సంఘాలకు ప్రత్యేక ఆహ్వానం



## కమిషనర్ కె. కన్నబాబు, ఐఏఎస్‌కు కృతజ్ఞతలు తెలిపిన క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్

**పుట్టపర్తి సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ప్రత్యేక ఆహ్వానితులు గా ప్రభుత్వం తేదీ 21-09-2026న ఉత్తర్వులు జారీ చేయడాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ ఆర్గనైజేషన్స్( క్యాప్కో) స్వాగతించింది. ఈ సందర్భంగా క్యాప్కో చైర్మన్ జి. సురేష్ కుమార్ రాష్ట్ర వినియోగదారుల ఉద్యమం తరపున ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు, ఐఏఎస్ కి సోమవారం సాయంత్రం విజయవాడలోని సివిల్ సప్లైస్ భవన్ కార్యాలయం నందు ఆయనను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు .ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం, రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీకి 12మందిప్రతినిధులను ప్రత్యేక ఆహ్వానితులుగా నామినేట్ చేయడాన్ని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో భాగస్వామ్యం కల్పించడం ద్వారావినియోగదారుల భాగస్వామ్యం, పార దర్శకత, ప్రజల భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతాయని క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. వినియోగదారుల సంఘాలకు క్షేత్రస్థాయిలో ఉన్న అనుభవం, ప్రజల సమస్యలపై అవగాహన విజిలెన్స్ కమిటీకి ఉపయోగకరంగా ఉంటుందని , ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థ, నిత్యావసర వస్తువుల సరఫరా, ఆహార భద్రత, వినియోగదారుల ఫిర్యాదులు, అక్రమాలు మరియు ప్రజలకు ఎదురయ్యే సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్ తెలియజేశారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల పాత్రను గుర్తించి, రాష్ట్ర స్థాయి విజిలెన్స్‌వ్యవస్థలోవారికి భాగస్వామ్యం కల్పించడం అభినందనీయమైన నిర్ణయం. కమిషనర్ కె. కన్నబాబు, ఐఏఎస్ సానుకూల మరియు సమగ్ర దృక్పథానికి క్యాప్కో తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు చైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ఆహార భద్రత, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం మరియు వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య క్యాప్కో తన పూర్తి సహకారం, నిర్మాణాత్మక సూచనలు అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌లో వినియోగదారుల స్వరం మరింత బలంగా వినిపించడానికి, ప్రజా ప్రయోజనాల పరిరక్షణకు బాధ్యతాయుతమైన విజిలెన్స్ వ్యవస్థకు మరింత దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వినియోగదారుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# చెక్ డ్యాముల నిర్మాణానికి స్థల పరిశీలన



**చిలమత్తూరు, సెప్టెంబర్ 22, మనంన్యూస్ :** మండల పరిధిలోని కుషావతి ఎరులో నీటిని నిల్వచేయడానికి చెక్ డ్యామ్ లు నిర్మించేందుకు ఆర్డీటీ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి నీటి నిల్వ అవసరమన్నారు. చిన్న నదుల్లో చెక్ డ్యామ్ లు నిర్మించడం వల్ల భూగర్భ జలాలు పెంచవచ్చన్నారు. మండల పరిధిలో సాధారణ వర్షపాతం ఎప్పుడూ తక్కువగా ఉంటుందని, ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కోవడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉన్నందున, వచ్చే వర్షపు నీటిని సంరక్షించుకోవడానికి చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీటీ కృషిని వీరయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, గౌరీ శంకర్, లక్ష్మీ నరసింహులు, లక్ష్మీనారాయణ యాదవ్, చంద్ర మోహన్, నారాయణ స్వామి, సూర్య నారాయణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# రాప్తాడులో ఎన్టీఆర్ పరిటాల రవీంద్ర విగ్రహాల ఆవిష్కరణ



## - హాజరైన ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిలు

**మడకశిర, సెప్టెంబర్ 22,మనంన్యూస్:** రాప్తాడు నియోజకవర్గం కేంద్రమైన రాప్తాడులో నూతనంగా ఏర్పాటు చేసిన నట సార్వభౌమ ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను మంగళవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించిన విషయం తెల్సింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ డి. శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీనారాయణ, రాష్ట్ర కుంచిటి వక్కలిగా సాధికారత కన్వీనర్ వీఎం పాండురంగప్ప, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కెఎన్ పల్లి సురేష్, అగళి జడ్పీటీసీఉమేష్ హాజరయ్యారు. మొదట వారు పుట్టపర్తి విమానాశ్రయంలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మంత్రి లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే నందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి వెంట రొళ్ల మండలం టీడీపీ క్లస్టర్ కో కన్వీనర్ గుడ్డగురుకి మారుతి, నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.



# 3 వార్డు కౌన్సిలర్‌గా అవకాశం ఇవ్వండి..

## టీడీపీ వీర విధేయుడు రియాజ్ బయో డేటా అందజేత..



**సోమందేపల్లి టౌన్ సెప్టెంబర్ 21 మనంన్యూస్ :** తెదేపా పార్టీ కోసం అహర్నిశలు పాటు పడి,వైసీపీ హయంలో ఎన్నో ఇబ్బందులు పడి,ప్రాణం పోయిన తెదేపా నీ వదిలే సమస్యే లేదు అంటూ నిలబడ్డ తెదేపా యువ నాయకులు,తిమ్మాపురం వాసి షేక్ రియాజ్ మంగళవారం పెనుకొండ అన్నా క్యాంటీన్ లో తనకు 3 వ వార్డు కౌన్సిలర్ గా అవకాశం ఇవ్వాలని సిక్స్ మ్యాన్ కమిటీ సభ్యులకు తన బయో డేటా అందించారు. ఊపిరి ఉన్నంత వరకు తెదేపాపార్టీ కోసంపాటు పడుతానని,మంత్రి సవిత కోసం అహర్నిశలు కష్టపడుతానని మాట ఇచ్చిన షేక్ రియాజ్. టిడిపి పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసంపార్టీ మనుగడకోసంఅహర్నిశలు తమకుటుంబం పనిచేస్తుందన్నారు. మంత్రి సవితమ్మ అడుగుజాడల్లో నడవడమే తమ దే యమన్నారు



# నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్...!

## పోగొట్టుకున్న మూడు తులాల బంగారం బాధితురాలికి అప్పగింత

**ధర్మవరం సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** పోగొట్టుకున్న మూడు తులాల బంగారు ఆభరణాలను పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు ఓ ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బురుజు వీధికి చెందిన జన్నే రాజేశ్వరి ఈ నెల 17న పేరూరుకు వెళ్లారు. బస్సు దిగే సమయంలో ఆమె వద్ద ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు పోగొట్టుకున్నారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ధర్మవరం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ నరసింహులుతో పాటు పోతుకుంటకు చెందిన రామాంజనేయులు, పేరూరు సమీపంలోని చేన్నంపల్లికి చెందిన సిద్ధమ్మకు బంగారు ఆభరణాలు దొరికాయి. వారు వాటిని తమ వద్ద ఉంచుకోకుండా భద్రంగా ధర్మవరం వన్‌టౌన్ ఎస్ఐ ఇషాన్ భాషకు అప్పగించారు. పోలీసులు బంగారం అసలు యజమానిని గుర్తించి, మంగళవారం వన్‌టౌన్ స్టేషన్ ఇన్‌చార్జ్ జయ నాయక్ చేతుల మీదుగా మూడు తులాల బంగారుఆభరణాలనుబాధితురాలుజన్నే రాజేశ్వరికి అందజేశారు. బంగారం దొరికిన వెంటనే పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్ నరసింహులు, రామాంజ నేయులు, సిద్ధమ్మలను పోలీసులు అభినందించారు. వారి నిజాయితీని స్థానికులు సైతం ప్రశంసించారు.

# 27న చెకుముకి సైన్స్ సంబరాలు

## - జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కె.చిత్తప్ప, కె.వీరరాజులు వెల్లడి

**అనంతపురం, సెప్టెంబర్ 22,మనంన్యూస్:** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఈనెల 27న ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కాలేజి డ్రామా హాల్ నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కె.చిత్తప్ప, కె.వీరరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ ఎమ్మెల్సీ జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం. గేయానంద్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అయూబ్ హుస్సేన్, వక్తలుగా విశ్రాంత అధ్యాపకులు జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి హాజరవుతారన్నారు. జిల్లాలోని 28 మండలాల నుండి 8 9,10 వ తరగతి విద్యార్థులకు సంబంధించిన 56 జట్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయని వారు తెలియజేశారు. వీరంతా ఆగస్టు 27న పాఠశాల స్థాయిలోను, సెప్టెంబర్ 11న మండల స్థాయిలో జరిగిన సైన్స్ సంబరాల్లో మొదటి స్థానంలో ఎంపికైన వారని వారు పేర్కొన్నారు. 27న, కార్యక్రమంలో పాల్గొనాలని మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారిని ఆయన చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకె భాస్కర్,నగర అధ్యక్ష కార్యదర్శులు కె. ప్రసాద్ రెడ్డి, ఎస్.తిరుపాల్, నాయకులు నానీల నాగేంద్ర, హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



# నా జీవితంలో అపురూపం.. ఈ క్షణం



## - రాంచరణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు ఇమాం హుస్సేన్

**అనంతపురం, సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** నా జీవితంలో ఇదొక మరచిపోలేని అపురూపమైన క్షణమిది అని రాంచరణ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఇమాం హుస్సేన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగాఫ్యామిలీ అంటేకేవలం ఒక కుటుంబం కాదు, కోట్లాది అభిమానుల గుండెల్లో నిండిపోయిన ఒక భావోద్వేగమన్నారు. మెగా ఫ్యామిలీ పట్ల, మెగాస్టార్ చిరంజీవి పట్ల అభిమానంతో చేస్తున్న నా సేవలను గుర్తించి, నాపై ప్రత్యేకమైన ఆప్యాయత చూపిస్తూ అభినందించిన పద్మవిభూషణ్, మా ఆరాధ్య దైవం, మెగాస్టార్ చిరంజీవికి కృతజ్ఞతలు తెలియజేశారు. నా లాంటి ఒక సామాన్య అభిమానిని గుర్తించి, ఆప్యాయంగా పలకరించి, అభినందించడం నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకం అన్నారు. ఆ ఒక్క మాట, ఆ ఒక్క ఆప్యాయత.. మెగా ఫ్యామిలీ కోసం మరింత సేవ చేయాలనే బాధ్యతను, ఉత్సాహాన్ని నాలో పెంచిందన్నారు. అలాగే మెగా ప్రొడ్యూసర్ సుస్మిత కొణిదెలకి కూడా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "రాబోయే రోజుల్లో ప్రతి అభిమానిని కలుస్తాను" అని చిరంజీవి చెప్పిన మాట ప్రతి మెగా అభిమానుడి గుండెల్లో ఆనందాన్ని నింపిందని, అభిమానులను ఇంతగా ప్రేమించే మనసు.. అభిమానుల కోసం ఎప్పుడూ నిలబడే ఆప్యాయత.. అదే చిరంజీవి గొప్పతనం అన్నారు. మెగాస్టార్ అడుగుజాడల్లో.. మెగా ఫ్యామిలీ సేవలో.. అభిమానుల కోసం ఎల్లప్పుడూ ముందుంటానని ఇమాం హుస్సేన్ పేర్కొన్నారు.

# వాల్మీకి విగ్రహ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే అమిలిలేని

### రాష్ట్రంలోనే ఎక్కడలేని విధంగా వాల్మీకి విగ్రహం



**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 22 మనంన్యూస్** : వాల్మికుల ఆరాధ్య దైవం అన్నదమ్ముల అనుబంధం చక్కటి కుటుంబం ఎలా ఉండాలి మానవ విలువలు తెలియజేసిన గొప్ప కవి వాల్మీకి మహర్షి విగ్రహం పట్టణం నందు నూతన హంగులతో తయారవుతున్న విగ్రహా పనులను మంగళవారం ఎమ్మెల్యే అమిలిలేని సురేంద్రబాబు పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు కమిటీ సభ్యులకు తెలిపారు.

# ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ విత్తనాలకు 80 శాతం సబ్సిడీ

### వేరుశనగ సాగు చేయని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ధర్మవరం సెప్టెంబర్ 22 మనంన్యూస్** : ఖరీఫ్-2026 సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ధర్మవరం మండలానికి వివిధ రకాల విత్తనాలను కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎన్.ఎం. ముస్తఫా తెలిపారు. ధర్మవరం మండలానికి ఉలవలు 600 క్వింటాళ్లు, అలసందలు 20 క్వింటాళ్లు, జొన్నలు 5 క్వింటాళ్లు, పెసలు 30 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉలవల విత్తనాల పూర్తి ధర 10 కిలోల బస్తాకు రూ.740 కాగా, ప్రభుత్వం 80 శాతం సబ్సిడీగా రూ.592 భరిస్తుందని తెలిపారు. దీంతో రైతు కేవలం రూ.148 చెల్లించి 10 కిలోల ఉలవలవిత్తన బస్తాను పొందవచ్చని వివరించారు. ఖరీఫ్-2026లో వేరుశనగ విత్తనాలుతీసుకోని రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలవ్యవసాయ అధికారిఎన్.ఎం. ముస్తఫాసూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు ప్రయోజనం పొందాలని ఆయన కోరారు.

# అమరావతి గ్యాస్ బాధితులకు ప్రత్యామ్నాయ ఏజెన్సీ ద్వారా సిలిండర్ల సరఫరాకు చర్యలు

### మనం కథనానికి తక్షణ స్పందన

**ధర్మవరం. సెప్టెంబర్ 22. మనంన్యూస్** : ధర్మవరం పట్టణంలో అమరావతి గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'అక్షర టైమ్స్'లో ప్రచురితమైన కథనానికి మంత్రి కార్యాలయం తక్షణమే స్పందించింది. అమరావతి గ్యాస్ ఏజెన్సీ ద్వారా సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులకు ప్రస్తుతానికి మరో గ్యాస్ ఏజెన్సీ ద్వారా సిలిండర్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించిచారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా సక్రమంగా లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మనం తన కథనం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై మంత్రి కార్యాలయం స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం పట్ల బాధితవినియోగదారులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి,వాటి పరిష్కారానికిసంబంధిత అధికారులదృష్టికి తీసుకెళ్లడంలో మీడియా పోషిస్తున్న పాత్రకు ఈ పరిణామం నిదర్శనంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. తమ సమస్యపై స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించిన మంత్రి కార్యాలయానికి, సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన 'అక్షర టైమ్స్'కు వినియోగదారులు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రజా సేవే లక్ష్యం..దుర్గం అభివృద్ధే ధ్యేయం




- రూ.200.84 కోట్లతో అభివృద్ధి పనులు.. 32 వార్డుల్లో మౌలిక వసతుల కల్పన
- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- ఇక్కడే సొంత ఇల్లు కట్టుకుంటా

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** ప్రజలే దేవుళ్లుగా భావిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. కుటుంబ సభ్యులకు సమయం కేటాయించలేనంతగా ప్రజా సేవలో నిమగ్నమై ఉన్నానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కళ్యాణదుర్గం పట్టణంలోని విద్యానగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపాలిటీలోని 32 వార్డుల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ మంచినీరు అందించడంతో పాటు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, పైప్‌లైన్లు, సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గానికి రూ. 200.84 కోట్ల నిధులు తీసుకువచ్చామని, వాటితో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. రూ.19 కోట్లతో 8.5 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి, రూ.2.40 కోట్లతో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంప్లెక్స్ నిర్మాణంలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను పరిష్కరించి, గతంలో అక్కడ వ్యాపారాలు నిర్వహించిన వారికి అవకాశం కల్పిం చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణం లో ఇప్పటికే నగరవనం ఏర్పాటు చేశామని, మరో రెండు పార్కులను రూ.1.44 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టడం కాకుండా, నిరంతరం ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. మైనార్టీల కోసం రూ.50 లక్షల సొంత నిధులతో షాదీఖానాను అభివృద్ధి చేశామని, ఈద్గా మైదానాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఫైర్‌స్టేషన్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించడంతో పాటు పెన్షనర్ల భవన్, యాదవ, పద్మశాలి, కనకదాస, వాల్మీకి భవనాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. బలిజ భవనానికి రూ.30 లక్షలు కేటాయిస్తున్నామని, వడ్డే కులస్తులకు భవనం, ఆధునిక సౌకర్యాలతో అంబేద్కర్ భవనం నిర్మిస్తామని తెలిపారు. ఏపీడీసీసీబీకిసొంత భవనం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. వాల్మీకి సర్కిల్‌ను రాష్ట్రంలోనే ప్రత్యేకంగాఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామని, కనకదాస విగ్రహాన్ని ఏర్పాటు చేసి సర్కిల్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. అక్కడ వాటర్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో పాటు రోడ్లకు ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అక్కమ్మకొండ క్రాస్ నుంచి టీ సర్కిల్ మీదుగా ప్రజావేదిక వరకు, అక్కడి నుంచి దొడగట్ట రోడ్డు బైపాస్ వరకు రూ.35 కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. నూతిమడుగు నుంచి తిమ్మసముద్రం పారిశ్రామిక పార్కు వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. బీటీపీ కాలువ పనులను 2028లోగా పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుహామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు పూర్తి కాలేదని విమర్శిం చారు. ప్రస్తుతంచేపడుతున్నఅభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని కోరారు. 'ఓట్ల కోసం కాకుండా అభివృద్ధి కోసం రాజకీయాలు చేస్తాను. సేవ చేయడమే నా స్వార్థం. నన్ను ప్రాణంగా ప్రేమించే నాయకులు, ప్రజల మధ్య పని చేయడం నా అదృష్టం. కుటుంబానికి సమయం కేటాయించలేనంతగా ప్రజా సేవలో ఉంటున్నాను" అని ఎమ్మెల్యే సురేంద్రబాబు పేర్కొన్నారు.



# కదిరి పట్టణ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

- పట్టణ అభివృద్ధికి రూ.29 కోట్ల ఎచ్ ఏఎం నిధులు
- కుప్పం నుంచి మున్సిపల్ ఎచ్‌ఏఎం ప్రాజెక్టులకు వర్చువల్ శ్రీకారం చుట్టిన సీఎం

**కదిరి,సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల అభివృద్ధికి చేపటనున్నఎచ్‌ఏఎం ప్రాజెక్టుల వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కదిరి పట్టణంలోని గర్ల్స్ కాలేజ్ ఎదురుగా ఉన్న తాయి గ్రాండ్‌లో కదిరి పట్టణ అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చు వల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు. కదిరి మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి ఎన్నడూ లేని విధంగా దాదాపు రూ.29 కోట్ల ఎచ్ ఏఎం నిధులతో కదిరి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నామని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధే కూటమి ప్రభుత్వానికి రాజకీయ సమాధానం... ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారు మాట్లాడుతూ, "కదిరి పట్టణానికి దాదాపు రూ.29 కోట్లఎచ్ ఏఎం నిధులు తీసుకురావడం మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులతో ప్రజలకు సమాధానం చెప్పే కూటమి ప్రభుత్వ విధానానికి నిదర్శనం" అని అన్నారు. "గతంలో అధికారంలో ఉన్నవారు అభివృద్ధి గురించి ఎన్ని మాటలు చెప్పినా ప్రజల ముందున్న వాస్తవం ఏమిటో ప్రజలే గమనించారు. ఇప్పుడు కదిరి పట్టణానికి భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నాం. ప్రజలకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదు.. అభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమం. కూటమి ప్రభుత్వం ఆ దిశగా పనిచేస్తోంది" అని తెలిపారు. స్థానిక





సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. "సీటు ఎవరికి వచ్చినా అభ్యర్థి ఒక్కరే కాదు.. కూటమి అభ్యర్థి. వ్యక్తిగత అభిప్రాయాలను పక్కన పెట్టి టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి"అనిఅన్నారు. "వైసీపీకి కదిరిలో రాజకీయంగా ప్రజల నుంచి మద్దతు లేదని, గత ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ప్రజల తీర్పు స్పష్టంగాఉందని"ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి నాయకులు సమష్టిగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆయన అన్నారు. "వైసీపీ రాజకీయాలకు ప్రజలు స్వస్తి చెప్పి అభివృద్ధి వైపు చూస్తున్నారు. కదిరి అభివృద్ధి కోసం ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు కేవలం రాజకీయాలు చేస్తున్నారో ప్రజలే నిర్ణయిస్తారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధే మా సమాధానం" అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా కదిరి నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# గురువులపై దాడిచేసిన గొడ్డలిపార్టీ రౌడీ బ్యాచ్ ఎక్కడున్నా వదలం!



**రాప్తాడు సెప్టెంబర్ 22 మనం న్యూస్ :**
శాప్ కార్యాలయం వద్ద విద్యనేర్పే గురువులపై గొడ్డలిపార్టీ రౌడీమూకలు విచక్షణారహితంగా గుడ్లతో దాడిచేశారు. ఈ దాడిలో పాల్గొన్న రౌడీ బ్యాచ్ లో ఏ ఒక్కరినీ వదలిపెట్టం. ఎపిలోనే కాదు, అండమాన్ లో ఉన్నా, ఆస్ట్రేలియా వెళ్లినా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ స్పష్టం చేశారు. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మాట్లాడుతూ... జగన్ టెన్త్ క్లాస్ తప్పాడు. అందువల్లే టీచర్లపై కక్ష పెంచుకున్నాడు. నిన్న ఉపాధ్యాయులపై రౌడీమూకలను ఉసిగొల్పాడు. ప్రతిపక్షంలో ఉన్నపుడే మేం భయపడలేదు, ఇప్పుడు భయపడతామా? నీతి, నిజాయితీగా బతికిన కుటుంబం మాది. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53రోజులు జైలులో పెట్టారు, ఒక్కటైనా నిరూపించగలిగారా? ఆయనపై పెట్టిన ఒక్క కేసుకూడా నిలబడలేదు. నాపై కోపం ఉంటే నేరుగా రా... టైమ్, డేట్ ఫిక్స్ చెయ్యి, తేల్చుకుందాం. కల్తీ మద్యం, ఎపిపిఎస్సీపై కూడా చర్చిద్దాం. నాపై కోపం ఉంటే నాతో తేల్చుకో. అంతేగానీ ఉపాధ్యాయుల జోలికొస్తే సహించేది లేదని లోకేష్ హెచ్చరించారు

**అబద్దానికి ప్యాంటు,షర్టు వేస్తే జగన్!..**

అబద్దానికి ప్యాంటు, షర్టు వేస్తే వచ్చే రూపమే జగన్. నిజం చెబితే తల వెయ్యి ఒక్కలు అవుతుందని ఆయనకు శాపం ఉంది. అందుకే ఎప్పుడూ నిజాలు మాట్లాడడు. అయిదేళ్లు ఒక్క డిఎస్సీ ప్రకటించలేదు, ఒక్క జాబ్ క్యాలెండర్ లేదు. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చి ఏ ఒక్క హామీని జగన్ నెరవేర్చలేదు. బాబు గారు తొలి సంతకం డిఎస్సీ పైనే చేశారు. దానిని ముందుకు సాగనీయకుండా చేసేందుకు వైసిపి నాయకులు 300 కేసులు వేశారు. ఎక్కడా కోర్టు తప్పుపట్టలేదు. 150రోజుల్లో 16వేల టీచర్ పోస్టులు భర్తీచేశాం. వారందరికీ అమరావతిలో అపాయింట్ మెంట్ లెటర్ ఇచ్చాం. ఏడాది తర్వాత ఇప్పుడు వచ్చి అవినీతి జరిగింది అంటున్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం గెలవాలి...**

గత సార్వత్రిక ఎన్నికల్లో 94శాతం సీట్లతో ఘనవిజయం సాధించాం. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో నూటికి నూరుశాతం గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలదే. వచ్చేనెలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కేడర్ సిద్ధంకావాలి. రెండున్నరేళ్ల తర్వాత ప్రజల వద్దకు వెళు తున్నాం. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలపై ప్రజల్లో చైతన్యం తేవాలి. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైంది. చిన్నచిన్న విభేదాలను పక్కనపట్టి ముందుకెళదాం. విజయం కోసం కలసికట్టుగా ముందుకు సాగుదాం. అన్నిస్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలిపించేందుకు కార్యకర్తలంతా కార్యోన్ముఖులు కావాలి. డిల్లీనుంచి గల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యం. రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం ఉండటం వల్ల మనం కోరిన అన్ని కోర్కెలు ప్రధాని తీరుస్తున్నారు.రాష్ట్రాభివృద్ధికోసం కలసికట్టుగా ముందుకెళ్లాలి. నోక్రాస్ ఫైర్, నో మిస్ ఫైర్, నో విడాకులు. మనదిఒకపెద్ద కుటుంబం. కుటుంబం అన్నాక సమస్యలు ఉంటాయి. కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుందాం.

**గొడ్డలి పార్టీ అనుబంధ విభాగాలు వేరు!..**

.మనకు తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయి. వైసిపి వాళ్లకు కూడా కొన్ని విభాగాలు ఉన్నాయి. అవి గొడ్డలి, గంజాయి, హిట్ అండ్ రన్, మహిళలను అవమానించడం, టీచర్లపై దాడిచేయడం వంటివి వారి విభాగాలు. మనపార్టీలో పరిటాల శ్రీరామ్ లాంటి అద్భుతమైన యువ నాయకత్వం ఉంది. ప్రజలకు సేవే చేసే నాయకత్వం మనది. వారి పార్టీలో హిట్ అండ్ రన్ లో జైలుకెళ్లిన వాడొకడు, భూకబ్జాలు, నకిలీ పత్రాలు సృష్టించిన వాడు మరొకడు, వరకట్నం కోసం భార్యను వేధించేవాడొకడు ఉన్నారు. గొడ్డలి పార్టీ నాయకత్వానికి, టిడిపి లీడర్ షిప్ కి తేడా ప్రజలు గమనించాలి. చంద్రబాబు మాకు ఓర్పు నేర్పడం వల్లే ఓపిగ్గా ఉన్నాం. లేకపోతే వైసిపి నాయకుల కథ మరోలా ఉండేది. ఎన్టీఆర్, చంద్రబాబు నేర్పిన క్రమశిక్షణ వల్లే నాలుగున్నర దశాబ్దాలుగా ప్రజాసేవలో ముందుకు సాగుతున్నాం.మరో వందేళ్లు ప్రజలకుసేవ చేసేలా పార్టీని పటిష్టం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

**రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు అవసరం...**

రాష్ట్రం సర్వతో ముఖాభవృద్ధి సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. అహంకారం, ఇగొ వద్దు. 1985 తర్వాత గెలవని నియోజకవర్గంలో 2019లో తొలిసారి ఓడిపోయా. అయిదేళ్లు కష్టపడి ప్రజలతో మమేకమై, వారి మనసు గెలుచుకున్నా. రాష్ట్ర చరిత్రలో మూడవ అత్యధిక మెజారిటీతో గెలిచా. సంక్షేమం, అభివృద్ధితోపాటు ప్రజల మనసు గెలిస్తేనే ఎన్నికల్లో విజయం సాధించగలం. ఏవైనా సమస్యలు ఉంటే కూర్చుని మాట్లాడుకోండి. మీరిచ్చిన ఫీడ్ బ్యాక్ వల్లే కొత్త పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రజల్లో చైతన్యం తెస్తే మళ్లీ భారీ మెజారిటీతో గెలుస్తాం. వరుసగా ఒకే ప్రభు త్వం రావడం వల్లేఒరిస్సా,గుజరాత్ లో అభివృద్ధి చెందా యి. రాష్ట్రంలో ఒకసారి మాత్రమే, అది కూడా చంద్ర బాబు గారివల్లే వరుసగా టిడిపి గెలిచింది. ప్రతిరూపాయి ఆదాయంలో 94పైసలు జీతాలకే సరిపోతోంది. ఆదాయాన్ని పెంచడంతోపాటు పెద్దఎత్తున సంక్షేమాన్ని అందిస్తున్నాం. వృద్ధులకు 4వేల పెన్షన్, స్త్రీశక్తి, దీపం, నేతన్నల సేవలో, ఆటోవాల సేవలో తదితర పథకాలు అందిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం.

**సేవాభావం అనంతపురం బ్లడ్ లోనే ఉంది...**

మెడపై కత్తిపెట్టినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పోరాడే కార్యకర్తలు టిడిపికే సొంతం. రాప్తాడుకు వచ్చినపుడు నాకు ఘనస్వాగతం పలికిన టిడిపి కార్యకర్తలకు పేరుపేరునా నమస్కారాలు. కళల కాణాచి లేపాక్షి, నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం, ప్రశాంతి నిలయం కొలువై ఉన్న నేల ఉమ్మడి అనంతపురం జిల్లా. లవ్ ఆల్ సర్వ్ ఆల్ అన్న సత్యసాయి జన్మించిన నేల అనంతపురం. నేను ఒకేసారి ఆయనను కలిశాను. దశాబ్దాల తర్వాత కూడాబాబా ఏ ఆలోచనతో సంస్థను స్థాపించారో ఇటీవల అక్కడ అదే క్రమశిక్షణ, పట్టుదల చూశా. ప్రజల కోసం దశాబ్దాల క్రితం స్థాపితమైన ఆర్ డిటి అనంతపురానికి అద్భుతమైన సేవలందిస్తోంది. సేవ మన బ్లడ్ లోనే ఉంది.అందుకే అన్నఎన్టీఆర్అనంతపురం జిల్లాను సొంతం చేసుకున్నారు. హిందూపూర్ ఎమ్మెల్యేగా గెలిపించి ముఖ్యమంత్రిని చేశారు. హరికృష్ణ, బాల మామయ్యలను శాసనసభకు పంపిన ఘనత అనంతపురం జిల్లాదే.

**పరిటాల కుటుంబంతో దశాబ్దాల అనుబంధం...**

పరిటాల కుటుంబంతో మా కుటుంబ అనుబంధం దశాబ్దాల నాటిది. అన్యాయం జరిగిన చోట ఎదురొడ్డి నిలబడాలన్నది ఇరు కుటుంబాల ధ్యేయం. మహిళల జోలికొస్తే తోలు తీయాలన్న లక్ష్యంతో పనిచేశాం. భూస్వాములతో పోరాడి నిరుపేదలకు భూమి పంచారు పరిటాల శ్రీరాములయ్య. ఫ్యాక్షన్ కు ఫుల్ స్టాప్ పెట్టారు పరిటాల రవీంద్ర. తనకు ప్రమాదం ఉందని తెలిసినా కార్యకర్తలను వెంటాడి చంపితే అండగా వెళ్లి, ప్రాణాలను కోల్పోయారు. కాంగ్రెస్, వైసిపిల హయాంలో ఉమ్మడి అనంతపురంలో 164మంది కార్యకర్తలను కోల్పోయాం. చంద్రబాబు గారు కార్యకర్తలు ఫ్యాక్షన్ వైపు వెళ్లకుండా ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూలు ఏర్పాటుచేశారు. ప్రతివారం ఎన్టీఆర్ మోడల్ స్కూలుకు వెళ్లి పిల్లల్లో ధైర్యం నింపారు. వారిని ప్రయోజకులను చేసిన ఘనత చంద్రబాబుది.

**అవినీతిలో "తోపు" కేడర్ ను ఇబ్బందిపెట్టాడు!...**

2019 నుంచి 24వరకు రాప్తాడులో ఒక గొడ్డలిపార్టీ దొంగ... అవినీతిలో తోపు టిడిపి కేడర్ ను ఇబ్బంది పెట్టాడు. తప్పుడు కేసులు బనాయించాడు. ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే తగ్గేది లేదు, కార్యకర్తలు ఎదురొడ్డి పోరా డారు.ఎన్ని కేసులుపెట్టినాభయపడలేదు. నాపై 23కేసులు పెట్టారు. పోరాటం మన బ్లడ్ లో ఉంది. రాప్తాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది తెలుగుదేశం. వైసిపి హయాంలో ఒక్క అభివృద్ధి లేదు. ఒకవైపు దాడులు, మరో వైపు అవినీతి రాజ్యమేలాయి. ప్రజల ఆశీర్వాదంతో తిరిగి సునీతమ్మను గెలిపించిన ఘనత రాప్తాడు ప్రజలది. మనమంతా ప్రజలకు అండగా నిలబడాలి. కలసికట్టుగా పోరాడాలి. జాకీ లాంటి సంస్థలను గత ప్రభుత్వంలో తరిమేశారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టారు. పార్టీ కేడర్ పై పెట్టిన దొంగ కేసులు తొలగించే బాధ్యత నాది. ఇప్పటికే 80శాతం తప్పుడు కేసులు తొలగించాం. కొన్ని కోర్టు వరకు వెళ్లాయి. న్యాయనిపుణుల సహకారంతో ఎన్నికల్లోపు ఆ కేసులు కూడా తీయించే బాధ్యత నాది.

**కార్తకర్తే అధినేత నినాదం ఆచరణలో చూపుతున్నాం!...**

ఇటీవల కేంద్ర కార్యాలయంలో జరిగిన లీడర్ షిప్ కాంక్లేవ్ లో ప్రతి సమావేశంలో జై కార్యకర్త అనాలని పిలుపునిచ్చాం. 2025 కడప మహానాడులో కార్యకర్తే అధినేత నినాదాన్ని తీసుకోవడమేగాక, ఆచరణలో అమలుచేస్తున్నాం. నేను, బాబు గారు ఏ కార్యక్రమానికి వెళ్లినా కార్యకర్తను కలిశాకే వెళ్తున్నాం. తోట చంద్రయ్య, అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ మనకు స్ఫూర్తి ప్రదాతలు. మెడపై కత్తి పెట్టి వారి నాయకుడికి జై కొట్టమంటే చంద్రయ్య జై చంద్రబాబు అని ప్రాణాలొదిలారు. చట్టాన్ని సవరించి, చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీది. కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు మరువరు. కార్యకర్తల కోసం ప్రమాద బీమా తెచ్చాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.175 కోట్లు కార్యకర్తలకు అందించి ఆదుకున్నాం. కార్యకర్తల ఆరోగ్యం చూసుకునే బాధ్యత నాది. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలకు రక్తపరీక్షలు చేయిస్తే 75శాతం మందికి ఆరోగ్యం సరిగాలేదు. అందరూ పరీక్షలుచేయించుకోండి. ఆరోగ్యం బాగుంటే కుటుంబసభ్యులు బాగుంటారు, పార్టీ బాగుంటుంది. ఆరోగ్య సమస్యలున్నవారికిమందులుకూడా ఉచితంగా అందిస్తాం.

**కష్టపడి పనిచేస్తే పదవులు వెదుక్కుంటూ వస్తాయి...**

పార్టీలో సంస్కరణల కోసం నేను పార్టీలో అంతర్గతంగా పోరాటం చేశా. జిల్లా నుంచి పార్లమెంటు పార్టీ వ్యవస్థ కోసం మూడు పొలిట్ బ్యూరో సమావేశాల్లో నా వాదన విన్పించా. సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తాం. పనిచేసే వారిని గుర్తిస్తాం. అందుకే మై టిడిపి యాప్ తెచ్చాం. మీరు చేస్తున్న ప్రతి కార్యక్రమం అప్ డేట్ చేయండి. రాష్ట్రవ్యాప్తంగా 45రోజుల్లో డోర్ టు డోర్ చేసిన ఘనత మన పార్టీది. మీరు ప్రజల చుట్టూ తిరగండి, పదవులు మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తాయి. పనిచేయకుండా పదవులు రావాలంటే కుదరదు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. కార్యకర్తలంతా గుర్తుపెట్టుకోవాలి. ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్తున్నాం. 10వేల పోస్టులతో మెగా జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. ఫైటర్ జెట్ నుంచి రాయల్ ఎన్ ఫీల్డ్ వరకు ఎన్నో పరిశ్రమలు రాయలసీమకు తెచ్చాం.

- నాపై కోపం ఉంటే తేల్చుకుందాం...రా... టీచర్ల జోలికొస్తే సహించేది లేదు!
- డేట్, టైమ్ ఫిక్స్ చేయి...డిఎస్సీతోపాటు ఎపిపిఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దాం
- నీతి,నిజాయితీలతో బతికిన కుటుంబం మాది... చంద్రబాబుపై ఒక్కటైనా నిరూపించగలిగారా?
- ప్రతిపక్షంలో ఉన్నపుడే భయపడలేదు... ఇప్పుడు భయపడతామా జగన్?!
- రాప్తాడు నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్



నిజంగడపదాటేసరికి అబద్దం ప్రపంచాన్ని చుట్టి వస్తుంది, మనం చేసిన అభివృద్ధి, సంక్షేమంతోపాటు గొడ్డలిపార్టీ తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉంది. పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి ప్రోగ్రామ్ చేయండి, మిమ్మల్ని వెదికి నామినేటెడ్ పదవులు ఇస్తాం. వడ్డెర సామాజికవర్గానికి చెందిన రమాదేవిని ఎమ్మెల్సీని చేశాం. ఆమె అడగక పోయినా వెదికి బాబుగారు పదవి ఇచ్చారు. మండలపార్టీ అధ్యక్షురాలు, క్లస్టర్ ఇన్చార్జి ని పొలిట్ బ్యూరో సభ్యులను చేశాం. మీరు చేసే కార్యక్రమాలు పార్టీకి తెలియజేయండి. మిమ్మల్ని గుర్తించే బాధ్యత మాది.

**అప్పర్ పెన్నార్ నిర్వాసితులకు పరిహారం అందిస్తాం...**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల వారీగా ఒక్కొక్కటిగా పూర్తిచేస్తూ వెళ్తున్నాం. వెలుగొండ నిర్వాసితులకు 800 కోట్లు చెల్లించడమేగాక ఆ ప్రాజెక్టును పూర్తిచేసి, 7 టిఎంసిల నీరు అందించిన ఘనత మన ప్రభుత్వానిది. ఒక్కొక్కటిగా అన్ని ప్రాజెక్టులూ పూర్తిచేస్తాం. అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం అందజేస్తాం. ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి నిధులు కేటాయిస్తాం. మన ప్రాంతానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రావాలి. పెట్టుబడులు తేవడంలో స్థానిక నాయకత్వానికి కూడాబాధ్యతఉంది. విద్యాశాఖకు సంబంధించి సునీతమ్మ చేసిన అభ్యర్థనలను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేస్తామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి ఎస్.సవిత, హిందూపూర్ ఎంపి బికె పార్థసారధి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరాం, హిందూపురం పార్లమెంటు పార్టీ ప్రెసిడెంట్ ఎంఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి హనుమప్ప, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, జిల్లాపార్టీ ఎన్నికల పరిశీలకులు ఏరాసు ప్రతాపరెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాప్తాడునియోజకవర్గ అబ్జర్వర్ పద్మలతారెడ్డి పాల్గొన్నారు.




## జర్నలిస్టుల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం

**– ఈ నెల 26న పుట్టపర్తిలో నిర్వహణ.. ప్రముఖ వైద్య సంస్థల నిపుణుల సేవలు**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో నిరంతరం విధులు నిర్వహించే జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పుట్టపర్తిలో ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఈ నెల 26న పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరంలో బెంగళూరుకు చెందిన వైదేహి హాస్పిటల్, తిరుపతిలోని ఎస్వీఐఎంఎస్, బసవ తారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వైద్య నిపుణులు పాల్గొని జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు అందించనున్నారు. వివిధ ప్రత్యేక వైద్య విభాగాలతో పాటు అత్యున్నత ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉండనున్నాయి. శిబిరంలో ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్, మామోగ్రఫీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి వైద్య నిపుణులు తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు, మార్గదర్శకాలు అందించనున్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఈ శిబిరంలో ప్రత్యేకంగా క్యాన్సర్ పరీక్షలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అవసరమైన జర్నలిస్టులకు సంబంధిత వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించి, తదుపరి వైద్య సలహాలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.






## రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో వినియోగదారుల సంఘాలకు ప్రత్యేక ఆహ్వానం

**– కమిషనర్ కె. కన్నబాబు, ఐఏఎస్‌కు కృతజ్ఞతలు తెలిపిన క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్**



**పుట్టపర్తి సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ప్రత్యేక ఆహ్వానితులు గా ప్రభుత్వం తేదీ 21-09-2026న ఉత్తర్వులు జారీ చేయడాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్( క్యాప్కో) స్వాగతించింది. ఈ సందర్భంగా క్యాప్కో చైర్మన్ జి. సురేష్ కుమార్ రాష్ట్ర వినియోగదారుల ఉద్యమం తరఫున ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, ఆహార & పౌర సరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు, ఐఏఎస్ కి సోమవారం సాయంత్రం విజయవాడలోని సివిల్ సప్లైస్ భవన్ కార్యాలయం నందు ఆయనను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు .ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం, రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీకి 12 మంది ప్రతినిధులను ప్రత్యేక ఆహ్వానితులుగా నామినేట్ చేయడాన్ని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా వినియోగదారుల భాగస్వామ్యం, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతాయని క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. వినియోగదారుల సంఘాలకు క్షేత్రస్థాయిలో ఉన్న అనుభవం, ప్రజల సమస్యలపై అవగాహన విజిలెన్స్ కమిటీకి ఉపయోగకరంగా ఉంటుందని , ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థ , నిత్యావసర వస్తువుల సరఫరా, ఆహార భద్రత, వినియోగదారుల ఫిర్యాదులు, అక్రమాలు మరియు ప్రజలకు ఎదురయ్యే సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్ తెలియజేశారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల పాత్రను గుర్తించి, రాష్ట్ర స్థాయి విజిలెన్స్ వ్యవస్థలో వారికి భాగస్వామ్యం కల్పించడం అభినందనీయమైన నిర్ణయం. కమిషనర్ కె. కన్నబాబు, ఐఏఎస్ సానుకూల మరియు సమగ్ర దృక్పథానికి క్యాప్కో తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు చైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ఆహార భద్రత, ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం మరియు వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య క్యాప్కో తన పూర్తి సహకారం, నిర్మాణాత్మక సూచనలు అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌లో వినియోగదారుల స్వరం మరింత బలంగా వినిపించడానికి, ప్రజా ప్రయోజనాల పరిరక్షణకు మరియు బాధ్యతాయుతమైన విజిలెన్స్ వ్యవస్థకు మరింత దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వినియోగదారుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## వ్యవసాయ కుటుంబం నుంచి వైద్య విద్య వైపు

**నీట్ పరీక్షల్లో మెరిసిన పేదింటి విద్యా కుసుమం..!**

**నల్లచెరువు సెప్టెంబర్ 22 మనం న్యూస్:** వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఓ యువకుడు పట్టుదలతో చదివి జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించాడు. నల్లచెరువు మండలం చిన్నపల్లేలపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ నీట్ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో 1,10,480వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 3,677వ ర్యాంకు సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచాడు. శ్రీధర్ తండ్రి నారాయణస్వామి, తల్లి సుహాసిని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ కుమారుడి చదువుకు ఎలాంటి లోటు రాకుండా ప్రోత్సహించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు శ్రీధర్ నిరంతర శ్రమ, క్రమశిక్షణతో చదివి నీట్‌లో మంచి ఫలితాన్ని సాధించాడు.



తల్లిదండ్రుల ప్రోత్సాహమే బలం తన విజయంపై శ్రీధర్ మాట్లాడుతూ.. "వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నాకు చదువే భవిష్యత్తుకు మార్గమని చిన్నప్పటి నుంచే భావించానని తెలిపాడు. నీట్‌లో మంచి ర్యాంకు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదివాను పేర్కొన్నాడు. చదువులో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నా తల్లిదండ్రులు నన్ను ప్రోత్సహించారని ఈ విజయం వారికి అంకితం అని తెలిపారు. వారి సహకారం, నా కష్టానికి ఈ ర్యాంకు ఫలితంగా భావిస్తున్నానని పేర్కొన్నాడు. ర్యాంకు కోసం మాత్రమే కాకుండా వైద్యుడిగా ఎదిగి పేద, గ్రామీణ ప్రజలకు సేవ చేయాలనేది తన కోరికని తెలిపాడు. తన విజయం చూసి మా గ్రామంలోని మరికొంతమంది విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని చదవాలని కోరుకుంటున్నాన్ని తెలిపారు. లక్ష్యాన్ని నిర్ణయించుకుని ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదివితే తప్పకుండా మంచి ఫలితం సాధించవచ్చు" అని శ్రీధర్ పేర్కొన్నాడు.

**గ్రామస్థుల అభినందనలు:** వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి జాతీయ స్థాయి పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించడం పట్ల శ్రీధర్‌ను గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు అభినందించారు. అతని తల్లిదండ్రులు నారాయణస్వామి, సుహాసినిని పలువురు అభినందిస్తూ "కుమారుడి చదువుకు అండగా నిలిచి అతడిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం అభినందనీయం" అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించవచ్చని శ్రీధర్ విజయం నిరూపిస్తోందని పలువురు అన్నారు. ఆర్థిక పరిస్థితులు, గ్రామీణ నేపథ్యం లక్ష్య సాధనకు అడ్డంకులు కావని, కష్టపడి చదివితే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని శ్రీధర్ నిరూపించాడని కొనియాడారు. శ్రీధర్ భవిష్యత్తులో వైద్య విద్యను అభ్యసించి మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అతని విజయం చిన్నపల్లెలపల్లి గ్రామంతో పాటు నల్లచెరువు మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలి



**నార్పల: సెప్టెంబర్ 22 మనం న్యూస్** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ, సిపిఎం, రైతు సంఘం నాయకులు కరువు దీక్షలు మంగళవారం కార్యక్రమం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, చంద్రబాబు సారధ్యం లోని కూటమి ప్రభుత్వం అనంతను కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం నాయకులు చిన్నప్ప యాదవ్, సిపిఐ కార్యదర్శి గంగాధర, సిపిఎం కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ.. రైతు రుణాలను రద్దు చేయాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## హక్కుల కోసం రోడ్డెక్కిన మండల వీఆర్ఏలు



**తనకల్లు, సెప్టెంబర్ 22మనంన్యూస్:** తనకల్లు మండల వీఆర్ఏలు తమ హక్కులు కోసం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష మంగళవారం చేపట్టారు. వీరి డిమాండ్స్ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలనీ, అర్హులకు పదోన్నతులు కల్పించాలని, నామిని వీఆర్ఏ డిమాండ్లను పరిష్కారం చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. వీరికి మద్దతుగా సిపిఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, కాంగ్రెస్ మండల కన్వీనర్ తోపు పారెస్,ఎస్సి ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు చెరుకూరి గంగులయ్య, మండల వీఆర్ఏలు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జరిమానా : ఎస్ఐ దిలీప్ కుమార్

**తనకల్లు, సెప్టెంబర్22మనంన్యూస్:** మండల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తున్న వారిపై తనకల్లు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో మోటార్ సైకిల్ వాహనాలు నడుపుతున్న నరసింహానాయక్ కద్రిపల్లి గ్రామం శ్రీనివాసపురం కోలార్ జిల్లా మరియు కే గణేష్ పరాకు వాండ్లపల్లి గ్రామం తనకల్లు మండలం మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని గౌరవనీయులైన జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, కదిరి వారి ముందు హాజరుపరచగా, విచారణ అనంతరం గౌరవ న్యాయమూర్తి ఇరువురికి చెరో రూ.19,000 (9 వేలు, 10 వేల రూపాయలు) చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మరియు కదిరి డీఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని తెలిపారు. అవసరమైతే చట్టప్రకారం జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించబడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తనకల్లు పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## మహా గణపతి ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే కందికుంట ఆహ్వానం

**– రూ.2 లక్షల విరాళాన్ని అందించిన ఎమ్మెల్యే కందికుంట**



**కదిరి,సెప్టెంబర్22మనంన్యూస్:** పందుల కుంట గ్రామంలో నిర్వహించనున్న శ్రీ మహా గణపతి ప్రతిష్టాపన, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ని పందులకుంట గ్రామస్తులు మంగళవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టనున్న ఆలయ నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సతీమణి శ్రీమతి కందికుంట యశోద దేవి చేతుల మీదుగా మాజీ ఎంపీపీ చక్రవర్దన్ రెడ్డి సమక్షంలో పందులకుంట గ్రామస్తులకు రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. గ్రామంలోని ఆధ్యాత్మిక, అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

# మంత్రి నారా లోకేష్‌ని కలసిన ఎమ్మెల్యే అమిలినేని

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 22 మనం న్యూస్**



సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థపాక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారక రామరావు, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల గుండెల్లో చిరస్తాయిగా నిలిచిన మహానుభావుడు, కొన్ని వేలమంది పేద వారికి పెళ్లిళ్లు చేసిన అలుపెరుగని ధీరుడు స్వర్గీయ పరిటాల రవీంద్ర విగ్రహ ప్రతిష్టలో పాల్గొనేందుకు విచ్చేసిన విద్యా మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని జోన్ 5 ఇంచార్జ్ రెడ్డప్ప శ్రీనివాస రెడ్డి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారది, మంత్రి సవితమ్మ, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎమ్ ఎస్ రాజు, ధర్మవరం ఇంచార్జ్ పరిటాల శ్రీరాములుతో పాటు మర్యాదపూర్వకంగా కలసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు.

# సీఎం సహాయక నిధి చెక్కుల పంపిణీ



**హిందూపురం (మనం న్యూస్) సెప్టెంబర్ 22:** హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయక నిధి చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, బాలాజీ చేతుల మీదుగా లేపాక్షి మండలం సిరివరం పంచాయితిలో శివకుమార్ కు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి మండల అధ్యక్షులు అభిలాష్,యూనిట్ ఇంచార్జి కంచిసముద్రం చంద్రశేఖర్ గౌడ్,ప్రభాకర్ రెడ్డి,రవి, సిరివరం పంచాయతీ అధ్యక్షులు జాకీర్ , సుబ్రమణ్యం , అంజనరెడ్డి, నాగరాజు తో పాటు పలువురు పార్టీ నాయకులు ,కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గుత్తి మున్సిపాలిటీ చైర్మన్ బిసి రిజర్వేషన్ అయితే నాకు అవకాశం కల్పించండి.

**ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యుడు ఎర్రగుడి రమేష్.**



**గుత్తి సెప్టెంబర్ 22 (మనం న్యూస్ )**

గుత్తి మున్సిపాలిటీ చైర్మన్ రిజర్వేషన్ లో భాగంగా బీసీలకు వస్తే నాకు అవకాశం కల్పించాలని ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యుడు ఎర్రగుడి రమేష్ జిల్లా స్థానిక ఎన్నికల ఇంచార్జ్ మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, గుంతకల్ శాసనసభ్యులు గుమ్మనూరుజయరాం, రాష్ట్ర కార్మిక శాఖ వెంకటశివుడు యాదవ్,గుత్తి,పామిడి మండలాల ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు,నియోజకవర్గం పరిశీలకలు హరి బాబుని కలిసి బయోడేటా సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలన్నీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సహకారంతో పరిష్కరించడానికి కృషి చేస్తామని బీసీ బోయ సామాజిక వర్గానికి మున్సిపల్ చైర్మన్ పదవి ఇంతవరకు ఎవరికి ఈ సామాజిక వర్గానికి ఇవ్వలేదని దయచేసి మున్సిపల్ చైర్మన్ సీటును నాకు ఇవ్వాలని ఎర్రగుడి రమేష్ కోరారు.

# పురంలో మూడోరోజు కొనసాగుతున్న వినాయక నిమజ్జనోత్సవం

**హిందూపురం (మనం న్యూస్) సెప్టెంబర్ 22.** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవాలు మూడోరోజు కూడా కొనసాగుతున్నాయి. నిమజ్జనం కోసం ఇంకా సుమారు 15 వినాయక విగ్రహాలు ఎదురుచూస్తున్నాయి. మూడు రోజులుగా నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతుండటంతో పోలీసు, మున్సిపల్ అధికారులు నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే నిమజ్జన కార్యక్రమాలను కొనసాగిస్తామని, ఆ తర్వాత నిమజ్జనాలను నిలిపివేసి మరుసటి రోజు నుంచి మళ్లీ ప్రారంభిస్తామని అధికారులు నిర్వాహకులకు సూచిస్తున్నారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఒక్కో విగ్రహాన్ని క్రమపద్ధతిలో నిమజ్జనం చేయిస్తున్నారు. ప్రస్తుతం మిగిలిన విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో రేపటి వరకు కూడా నిమజ్జన కార్యక్రమాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పట్టణంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.



# మెరుగైన వైద్య సేవలందించండి

**హిందూపురం (మనం న్యూస్) సెప్టెంబర్ 22.** స్థానిక మండల పరిధిలో కె.బసనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం ఆకస్మికంగా సందర్శించి పీహెచ్‌సీ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వివిధ రిజిస్టర్లు, రికార్డులు, ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను పరిశీలించి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్ఓ అందించిన సూచనలు, మార్గదర్శకాలను పాటిస్తూ సేవా సంకల్ప అభియాన్ స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని మెడికల్ ఆఫీసర్లు డా. ఎస్. జయంత్ నాయక్ మరియు డా. ఎస్. షిఫా సుల్తానా తెలిపారు.



# పుట్టపర్తి నియోజకవర్గానికి రూ.8.20 కోట్ల తాగునీటి నిధులు

**– గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**
**– నీటి సమస్య పరిష్కారానికి నిధుల కొరత లేదు.. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు**



**పుట్టపర్తి, సెప్టెంబర్ 22 మనం న్యూస్** : పుట్టపర్తి నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ తాగునీటి సమస్యలు, పుట్టపర్తి మున్సిపాలిటీలో నీటి సరఫరా, వివిధ అభివృద్ధి పనులపై గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ, మున్సిపల్ అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశమని తెలిపారు. నీటి సమస్య ఉన్న గ్రామాలను తక్షణమే గుర్తించి, సమస్య తీవ్రతను బట్టి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నియోజకవర్గంలో తక్షణ తాగునీటి ఎద్దడి నివారణకు తన ప్రత్యేక కృషితో రూ.8.20 కోట్లు మంజూరు చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం నుంచి తాగునీటి సమస్య పరిష్కారానికి నిధుల కొరత లేదని, అవసరమైన చోట నిధులను వినియోగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయాలని సూచించారు.

పుట్టపర్తి మున్సిపాలిటీ తాగునీరు, వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. బోర్లు, పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి వనరులు, పంపింగ్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు. సాంకేతిక లోపాలు, పైపులైన్ లీకేజీలు, నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హెచ్చరించారు. ప్రజలు ఫిర్యాదు చేసిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే సమస్యలను గుర్తించి పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నిరంతరాయంగా తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి వనరుల లభ్యత, బోర్ల పరిస్థితి, పైపులైన్ల పనితీరు, ట్యాంకుల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.

సమావేశంలో గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ డీఈ గంగాధర్, ఆరు మండలాల ఏఈఈలు, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి విమానాశ్రయంలో నారా లోకేష్‌కు టీడీపీ శ్రేణుల స్వాగతం

**– రాప్తాడులో పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు**



**పుట్టపర్తి, సెప్టెంబర్ 22 మనం న్యూస్:** రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు మండల కేంద్రంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన టీడీపీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. ఉదయం 8.45 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న నారా లోకేష్‌కు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, టీడీపీ జోనల్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, ఎమ్మెల్యేలు ఎం.ఎస్. రాజు, దగ్గుపాటి వెంకట ప్రసాద్, కందికుంట ప్రసాద్, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి, ఎమ్మెల్సీ రమాదేవి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, గుండుమల తిప్పేస్వామి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. అనంతరం మంత్రి నారా లోకేష్ రాప్తాడు మండల కేంద్రానికి వెళ్లి ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# పెద్దవడుగురు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి: బిజెపి..



**పెద్దవడుగూరు సెప్టెంబర్ 22 మనం న్యూస్:** పెద్దవడుగూరు మండలాన్ని ప్రభుత్వం తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని మండల బిజెపి అధ్యక్షులు దే వన రమేష్ రెడ్డి. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సుంకి రెడ్డి ఆధ్వర్యంలో మండల తాసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు సుంకిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎల్ నీనో తీవ్రత ప్రభావం వల్ల మండలం వ్యాప్తంగా వర్షాలు కురవక సాగు పంటలు అయినా పత్తి వేరుశనగ జొన్న కంది తదితర పంటలు ఎల్ నీనో.ప్రభావం వల్ల మండల వ్యాప్తంగా. సాగు పంటలన్నీ ఎండిపోయాయని పంట చేతి కిందక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేటట్లు లేదని బ్యాంకుల నుంచి పంట సాగుకు తెచ్చిన అప్పులు కట్టలేని స్థితిలో రైతులు ఉన్నారని కనుక వ్యవసాయ రైతుల. కు ఇన్పుట్ సబ్సిడీ ప్రకటించి అలాగే నష్టపరిహారం రైతుల ఖాతాలో జమ చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని. అలాగే ఒకే దప రైతులకు రెండు లక్షల వరకు రుణ.మాఫీ చేయాలని. బిజెపి పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలం లో వివిధ గ్రామాలనుంచి వచ్చే స్థానికులకు. మరుగుదొడ్లు లేక. బ్యాంకుల దగ్గర బస్టాండ్ సమీపాన. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని. ప్రధానంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కనుక బ్యాంకుల దగ్గర బస్టాండులో ప్రభుత్వము మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.. ఈ కార్యక్రమం లో కిషన్ మోర్చా జోనల్ ఇంచార్జి తెగదోడి తిమరెడ్డి విద్యుత్ జిల్లా మోర్చా అధ్యక్షులు ఎం రామాంజినేయులు కిషన్ మోర్చా అధ్యక్షులు బి. విరారెడ్డి అనంతరామకృష్ణరెడ్డి శ్రీనివాసులు రామాంజినేయులు శేషనందరెడ్డి వెంకటేశ్వర్లు పూల కృష్ణమూర్తి సురేష్ వెంకటరామిరెడ్డి శివారెడ్డి అజయిరెడ్డి బిజెపి పార్టీ కార్యకర్తలు రైతులు తదితరులు.పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి పునాది.. పోషకాహారమే..

**– గోరంట్లలో ఘనంగా 9వ జాతీయ పోషణ మాసోత్సవం**
**– జంక్‌ఫుడ్‌కు దూరంగా.. చిరుధాన్యాలు, సహజ ఆహారానికి చేరువ కావాలి**



**గోరంట్ల, సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** మారుతున్న జీవనశైలితో ఆహారపు అలవాట్లలోనూ అనేక మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పోషకాహారంపై అవగాహన ఎంతో అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమతుల్య ఆహారం, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలను నిత్య ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ సందేశంతో గోరంట్ల పట్టణంలోని ఐకేపీ భవనంలో 9వ జాతీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సోమందేపల్లి ప్రాజెక్టు సీడీపీఓ డాక్టర్ శాంతలక్ష్మి, గోరంట్ల మండల డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ-1 జాన్ రెడ్డప్ప, ఎంఈఓ-2 గోపాల్, ఏపీఎం బాబ్జి, ఎస్‌వీపీఎం కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు ఆకుకూరలతో తయారు చేసిన బొకేలతో అతిథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ డాక్టర్ శాంతలక్ష్మి మాట్లాడుతూ.. పిల్లలు, యువత జంక్‌ఫుడ్, ప్యాకేజ్డ్ ఆహారాల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని, ఇటువంటి ఆహారాన్ని తరచూ తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోవడంతో పాటు భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బాలింతలు పోషక విలువలున్న సహజ ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పులు, శనగలు, పెసలు, మినుములు, సోయా, పాలు, పెరుగు, గుడ్లు వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా పిల్లల ఎదుగుదలకు, శరీర నిర్మాణానికి తోడ్పడుతుందని వివరించారు. ఎంఈఓ-1 జాన్ రెడ్డప్ప మాట్లాడుతూ.. మన పూర్వీకుల ఆహార విధానంలో ఆరోగ్య రహస్యం దాగి ఉందని అన్నారు. గతంలో స్థానికంగా లభించే ధాన్యాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్నే ఎక్కువగా తీసుకునేవారని, ప్రస్తుతం వాటిని పక్కనపెట్టి అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం వైపు మళ్లడం ఆందోళనకరమన్నారు. స్థానికంగా లభించే సహజ ఆహార పదార్థాలను తిరిగి ఆహారంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండల డిప్యూటీ ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. చిరుధాన్యాలు మన పూర్వీకుల ఆహార సంపద మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఉపయోగపడే పోషక వనరులని తెలిపారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, అరికెలు వంటి చిరుధాన్యాల్లో పీచు, ఖనిజాలు తదితర పోషకాలు సమృద్ధిగా ఉంటాయని చెప్పారు. మారుతున్న జీవనశైలితో పెరుగుతున్న ఆరోగ్య సమస్యల నేపథ్యంలో కుటుంబ ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత పెంచాలని సూచించారు. ఎస్‌వీపీఎం కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం మాట్లాడుతూ.. తెల్ల బియ్యం, చక్కెర, ఉప్పు, మైదా వంటి నాలుగు తెల్లటి పదార్థాల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని సూచించారు. ఆహారం కేవలం ఆకలి తీర్చడానికి మాత్రమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. తక్కువగా ప్రాసెస్ చేసిన సహజ ఆహార పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎంఈఓ-2 గోపాల్ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే పిల్లల్లో అధిక బరువు, మధుమేహం తదితర జీవనశైలి సంబంధిత సమస్యలు కనిపిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. రుచికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకుండా ఆహారంలోని పోషక విలువలను గుర్తించి తీసుకునే అలవాటును చిన్ననాటి నుంచే పెంపొందించాలని సూచించారు. పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం, సరైన పరిమాణం, శారీరక శ్రమ ప్రాముఖ్యతను తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో పోషకాహారంతో కూడిన వివిధ ఆహార పదార్థాలు, సంప్రదాయ వంటకాలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలను ప్రదర్శించారు. "ఆరోగ్యకరమైన కుటుంబం--పోషకాహారంతో కూడిన సమాజం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సీడీపీఓ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సోమందేపల్లి ప్రాజెక్టు యూనియన్ లీడర్ శ్రీదేవి, గోరంట్ల మండల అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## నష్టపోతున్న రైతంగా న్ని, ప్రభుత్వం ఆదుకోవాలి

**పెద్దవడుగూరు సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన సిపిఐ. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల తీవ్రమైన కరువు దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని అదేవిధంగా



,పెద్దవడుగూరు మండల రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, కంది పంటలు వర్షాభావం వలన పూర్తిగా దెబ్బతిని నష్టాల పాలయ్యారని. మంగళవారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ ఆందోళన నిర్వహించింది. అనంతరం మండల తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా పలువురు మాట్లాడు తూ ఎల్ ని నో ప్రభావం వల్ల పెద్దవడుగూరు మండల వ్యాప్తంగా తీవ్ర లోటు వర్షపాతంతో ఖరీఫ్ సీజన్లో విత్తిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని కనుక ప్రభుత్వము త్వరగా కరువు ప్రాంతంగా ప్రకటించాలని పెద్దవడుగూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకోవాలి. ఖరీఫ్ సీజన్‌లో వంట నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారం తోపాటు , తక్షణమే పంటల బీమాను కూడా అమలు చేయాలన్నారు. పశువులకు పశుగ్రాసం, నీరు ఏర్పాటు చేయాలని కరువులో తాగునీటి కొరత లేకుండా ప్రజలకు ప్రత్యామ్నాయం చూపాలని . తీసుకున్న రుణాలను రెండు లక్షల రూపాయల వరకు ప్రతి రైతుకు మాఫీ చేయాలని అలాగే.గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా వలసలు నిర్మూలించి ప్రభుత్వమే పనులు కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపి ఐ సీనియర్ నాయకులు నారాయణ మండల సహాయక కార్యదర్శి రంగస్వామి మండల సహాయక కార్యదర్శి సుధాకర్ వడుగూరు నారాయణ రంగ నాయకులు నాగేంద్ర రామయ్య ప్రకాష్ రామాంజనేయులు వెంకట రాముడు విష్ణువర్ధన్ రెడ్డి రాకేష్ రెడ్డి సంజన పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్‌కి స్వాగతం

**– ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**



**కదిరి, సెప్టెంబర్22 మనంన్యూస్:** పుట్టపర్తి విమానాశ్రయానికి చేరు కున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కి కదిరి నియోజక వర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నారా లోకేష్ ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, నియోజకవర్గాల వారీగా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు.

## బీసీ సంక్షేమ సంగం మండల యూత్ ప్రసిడెంట్ గా సోంపాళ్యం అఖిల్



**తనకల్లు, సెప్టెంబర్ 22 మనంన్యూస్:** మండలంలోని బాలసముద్రం పంచాయతీ, కొక్కంటి క్రాస్‌కు చెందిన సోంపాలెం అఖిల్ భూషణ్ ని బీసీ సంక్షేమ సంఘం తనకల్లు మండలం యూత్ ప్రెసిడెంట్‌గా నియ మించడం జరిగింది. ఈ సందర్భంగా కదిరి నియోజకవర్గ బీసీ సంక్షేమ శాఖ అధ్యక్షులు మీరాసి వేమనారాయణ చేతుల మీదుగా నియామక మెమోరాండం అందజేయబడింది. నూతన బాధ్యతలు స్వీకరించిన అఖిల్ భూషణ్ బీసీ సంక్షేమ శాఖకు, సంఘానికి మరియు ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని మీరాసి వేమనారాయణ ఆకాంక్షించారు.

## శింగనమలను కరువు మండలంగా ప్రకటించాలి

**– డి.చిన్నప్పయాదవ్ శింగనమల సీపీఐమండల కార్యదర్శి**



**శింగనమల సెప్టెంబర్ 22 మనం న్యూస్:** సీపీఐ ఆద్వర్యంలో రెండవరోజు కరువు దీక్షలు శింగనమల తహశీల్దార్ కార్యాలయం దగ్గర సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్ అద్వర్యంలోప్రారంభమయ్యాయి. ఈసంధ ర్భంగా సీపీఐమండలకార్యదర్శి మధు యాదవ్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగారైతు పరిస్థి తుల పైఎండిపోతున్న పంటపోలాలను బోరుబావులను చూసి రైతులందరుకన్నీటిపర్యం తమవుతున్నారు. వేసిన పంటలు చేతికోచ్చే పరిస్థితిలేదు. ఉద్యానపంటలు కూడఅనావృష్టికీగురై బోరుబావుల్లో నీరు అడుగంటి పోవడంతో రైతులనుఅదుకోవాలితక్షణమేశింగనమలమండలాన్ని కరువుమండలాలుగాప్రకటించాలని డిమాండ్ కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుమండలాన్ని రైతంగాన్ని, ప్రజలను ఆదుకోవాలి. కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలి గ్రామీణ ప్రాంతాల్లో అవసరం ఉన్న ప్రతి గ్రామంలోనూ ఉచిత తాగునీటి సౌకర్యం కల్పించాలి. పశువులకు పశుగ్రాసం అందించేందుకు ప్రత్యేకంద్రాలను ఏర్పాటు చేయాలి కరువు రైతులకు అన్ని రకాల బ్యాంకు రుణాలను రద్దు చేయాలి గ్రామీణ ప్రాంత కూలీలకు ఎలాంటి షరతులు లేకుండా ఉపాధి హామీ పనులను కల్పించాలి గ్రామీణ ప్రాంతాల్లో చిన్న సన్నగా రైతులకు కూలీలకు కరువు పెన్షన్లు ఇవ్వాలి పంట నష్టపరిహారం ఇవ్వడంతో పాటు పంటల బీమాను అమలు చేయాలి అన్ని చెరువులకు నీళ్లు ఇవ్వాలి రైతులను అన్ని వర్గాల వారిని ఆదుకోవాలి ఈకార్యక్రమములో సీపీఐరైతుసంఘమునాయకులు కార్యదర్శి, నారప్ప, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులుమునిస్వామి, రూప్లానాయక్ , రామాంజినేయులు, కిష్టా,రవిరెడ్డి, గంగరాజు, అదెన్న, నాగరాజు, అచారి, నాగరాజు, రామాంజి, నల్లప్ప, దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## 24న లోగా ఆయా పోస్టుకు మహిళలు దరఖాస్తు చేసుకోండి

**– కుందుర్పి మండల డాక్టర్ తరుణ్ సాయి**



కుందుర్పి, సెప్టెంబర్ 22 (మనం న్యూస్):. మండల కేంద్రమైన కుందుర్పి గ్రామంలో ఒక ఆశా కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందని, ఈ పోస్టుకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యశాఖ అధికారులుచే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయా పోస్టుకు దరఖాస్తు చేయదలచుకున్న వారు ఈ నెల 24 లోపు కుందుర్పి ప్రభుత్వ ఆసుపత్రిలో తమ దరఖాస్తులను అందజేయాలని స్థానిక వైద్యాధికారి , ఈ మేరకు ఒక ప్రకటనలో తరుణ్ సాయి పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు 10వ తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలని, ఆమె కుందుర్పి గ్రామానికి చెందిన వారై కోడలిగా ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు.

## ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలును చేరవేయాలి

**– కుందుర్పి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డా. ప్రసన్న భారతి**



**కుందుర్పి, సెప్టెంబర్ 22, (మనం న్యూస్):** ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యసేవలును చేరవేయాలిని, ఆదిశగా ముందుకు పయనించాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్, ప్రసన్న భారతి సూచించారు. మంగళవారం కుందుర్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు మరియు ఇ,హెచ్,ఆర్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్, మరింత మెరుగ్గా అమలు చేయాలని సూచించారు. 14 ఏళ్ల బాలికలకు హెచ్,పి,వివ్యాక్సిన్ ను బాలికలకు టీకాలు వేయడంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని వైద్యాధికారులును ఆదేశించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.వైద్య సేవలు ప్రజలకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహించ వద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ,డాక్టర్ ,సునీత, డిపి హెచ్ యన్ఓ ,ప్రమీలా దేవి, వైద్యాధికారులు, హర్షవర్ధన్, సోమేశ్ కుమార్, మరియు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## గుత్తి మున్సిపల్ చైర్మన్ బరిలోకి స్వచ్ఛంద సేవకుడు సయ్యద్ షేక్షావలి

**జనరల్ రిజర్వేషన్ వస్తే స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధం,పట్టణంలో జోరుగా ప్రచారం.**



**గుత్తి సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ):** గుత్తి మున్సిపాలిటీలో రాబోయే మున్సిపల్ ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఈసారి మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్ రిజర్వేషన్‌కు కేటాయిస్తే, స్వచ్ఛంద సేవకుడు సయ్యద్ షేక్షావలి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పట్టణంలో ప్రచారం జోరుగా వినిపిస్తోంది. గత 11 సంవత్సరాలుగా గుత్తి పట్టణంలో రెడ్ ప్లస్ సంస్థ ద్వారా సయ్యద్ షేక్షావలి వేలాది సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆయన, ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యక్షంగా బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మున్సిపల్ చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారన్న వార్తలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. అయితే, ఈ విషయంపై సయ్యద్ షేక్షావలి నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. జనరల్ రిజర్వేషన్ వస్తే ఆయన నిజంగానే ఎన్నికల బరిలోకి దిగుతారా? ప్రజల మద్దతు ఎలా ఉంటుంది? అన్న అంశాలపై పట్టణ ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# గోరంట్లలో ఘనంగా గౌరీపుత్రుడి నిమజ్జనం

**-బి బాయ్స్ లడ్డూ వేలంలో మహిళల హవా..**
**రూ. 1,00,116కు రేష్మా, భవ్య కైవసం**
**-రంగులు చల్లుకుంటూ.. డీజే పాటలకు యువత కేరింతలు**





**గోరంట్ల, సెప్టెంబర్ 22 మనం న్యూస్:** వినాయక చవితి సందర్భంగా గోరంట్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగిన అనంతరం నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని మూలబావి వద్ద బి బాయ్స్ వినాయక సేవా సమితి ఆధ్వ ర్యంలో, ఎయిర్‌టెల్ టవర్ ప్రాంతంలో లంభోదర లెజెండ్స్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన గౌరీపుత్ర వినాయకుల నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నిమజ్జనానికి ముందు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం వినాయక విగ్రహాలను డీజే వాహనాలతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేయగా, మహిళలు, చిన్నారులు, యువకులు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. దీంతో పట్టణ ప్రధాన రహదారులు ఉత్సవ సందడితో కళకళలాడాయి. మూలబావి వద్ద బి బాయ్స్ వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పురుషులు, మహిళలు పోటాపోటీగా వేలం పాటలో పాల్గొనడంతో ఉత్కంఠ నెలకొంది. చివరకు రేష్మా, భవ్య అనే యువతులు రూ. 1,00,116కు బి బాయ్స్ వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న రేష్మా, భవ్యలను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎయిర్‌టెల్ టవర్ ప్రాంతంలో లంభోదర లెజెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంలో యువకుడు అరవింద్ రూ. 16 వేలతో లడ్డూను సొంతం చేసుకున్నారు. వేలం కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా స్థానిక పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.

# వర్షాలతో రబీపై ఆశలు.. రైతులకు కొండంత భరోసా కల్పించాలి

**- వ్యవసాయ, అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి..**
**ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి**
**-జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**



**పుట్టపర్తి, సెప్టెంబర్ 22మనం న్యూస్ :** త వర్షపాత పరిస్థితులతో రబీ సీజన్‌పై ఆశలు చిగురిస్తున్న నేపథ్యంలో రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సంపూర్ణ భరోసా కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో రబీ సాగు, ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణ, ఆధునిక సాంకేతికత వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.


ప్రస్తుత వర్షాల వల్ల రబీ సీజన్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులకు నష్టం కలగకుండా ఉలవ, పెసర, అలసంద, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి అవసరమైన మేరకు పంపిణీ చేయాలని ఆదేశించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను చేరువ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రోన్లు, కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించే విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆధునిక సాంకేతికత ద్వారా సాగు ఖర్చులు తగ్గించడం, పంటల పర్యవేక్షణ, ఉత్పాదకత పెంపుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, సూక్ష్మ సాగునీటి విధానాలు, ఇంకుడు గుంతల ఏర్పాటుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించే చర్యలను గ్రామస్థాయిలో విస్తృతంగా చేపట్టాలని చెప్పారు. భూసార పరిరక్షణలో భాగంగా బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహించాలని, ఖాళీ భూముల్లో నేల కోతను అరికట్టేందుకు హాఫ్ మూన్ నమూనా పనులు చేపట్టాలని సూచించారు.

పాలిహౌస్‌లు, నర్సరీల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. రైతు మిత్ర బృందాలను మరింత బలోపేతం చేసి, గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రబీ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, నీటి సంరక్షణ పద్ధతులు అందుబాటులో ఉండేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని శ్యామ్ ప్రసాద్ సూచించారు. ప్రస్తుత వర్షాలతో రబీ సీజన్ ఆశాజనకంగా మారుతోందని, పంటల ఉత్పాదకత పెంచేందుకు ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# చిత్రదుర్గం ఎంపిని గోవింద్ ను కలిసిన కూటమి నాయకులు

**-కర్నాటక ఎంపికి కూటమి నాయకులు ఘన స్వాగతం.**
**-రెండు అంతరాష్ట్ర సర్వీసులును కొన సాగించాలని వినతి**

**కుందుర్పి, సెప్టెంబర్ 22 (మనం న్యూస్):** కర్నాటకలో రాష్ట్రంలోని చిత్రదుర్గం జీల్లా పార్లమెంట్ సభ్యులు, అయిన గోవింద్ మక్తప్ప కర్జోల్ ను మంగళవారం మండల కేంద్రంమైన కుందుర్పిలో కుందుర్పి మండల కూటమి నాయకులు ఆత్మీయంగా కలుసుకున్నారు. చిత్రదుర్గం నుంచి వై.ఎన్.హోసకోటకు కుందుర్పి మీదుగా ప్రయాణిస్తున్న ఎంపీకి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆంధ్ర సరిహద్దు గ్రామాల ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కుందుర్పి నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మస్థలానికి, అలాగే కర్నాటక రాజధాని అయిన బెంగళూరుకు కె ,యస్ ఆర్ టిసి బస్సు సర్వీసులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కుందుర్పి -ధర్మస్థలము ఆద్యాత్మిక క్షేత్రం అని భక్తులు అధికంగా వెళ్ళుతున్నరని తెలిపారు. అదేవిధంగా కర్నాటక, ఆంధ్ర ప్రక్కన ఉన్న సరిహద్దు ప్రాంతం కాగా ఇద్దరికి వాణిజ్య వ్యాపార పరంగానూ,వివాహ సత్సంబంధాలు కలవని, కర్నటక, ఆంధ్ర రాష్ట్రలుకు తల్లి బిడ్డ లాంటి సంబంధం కలదని ఎంపి గోవిందు వద్ద కూటమి నాయకులు ఏక కరువు పెట్టారు. కుందుర్పి - బెంగళూరు కెయస్ ఆర్టిసి ని తద్వారా ఎంపి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల అవసరాలను దృష్ట్యా పరిగణనలోకి తీసుకుని కర్ణాటక ఆర్టీసీ అధికారులతో తాను చర్చిస్తానని ఎంపీ కూటమి నాయకులుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం బీజేపీ, నాయకులు, బంగారు మల్లారెడ్డి, ఆదినారాయణ, గంగాధర, కిరణ్, పావగడ తాలూకా బీజేపీ అధ్యక్షులు, అశోక్, టీడీపీ నాయకులు, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అవకాశం కల్పించాలి

**– ఏఐటీయూసీ వినతి**




**నల్లచెరువు సెప్టెంబర్ 22 మనం న్యూస్**
గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, వారి కుటుంబ సభ్యులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పొందేందుకు అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం నల్లచెరువు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం దరఖాస్తులకు అవకాశం కల్పించినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ల దరఖాస్తులను గ్రామ సచివాలయాల్లో స్వీకరించడం లేదని నాయకులు తెలిపారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతూ దరఖాస్తులను పక్కన పెడుతున్నారని పేర్కొన్నారు. అలాగే సిక్స్‌స్టెప్ వాల్యుయేషన్‌లో సీఎఫ్ఎంఎస్ ఐడీ ఉండటాన్ని కారణంగా చూపుతూ దరఖాస్తులు తీసుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పునఃపరిశీలించి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, వారి కుటుంబ సభ్యులు అర్హత కలిగి ఉంటే ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని వారు కోరారు. గ్రామ సచివాలయాల ద్వారా అంగన్వాడీల దరఖాస్తులను స్వీకరించి, అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మధురై, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మాబున్నీసా పాల్గొన్నారు. సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఉమర్ ఖాన్

**– టీడీపీకి, ప్రజలకు ఉమర్ చేస్తున్న సేవలకు లోకేష్ అభినందనలు**



**గోరంట్ల, సెప్టెంబర్ 22, మనం న్యూస్ :**
రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసినందుకు గోరంట్ల పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ యువ నాయకుడు, సమాజ సేవకుడు ఉమర్ ఖాన్ సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ కోసం తాను చేస్తున్న సేవలను రాష్ట్ర మంత్రి స్వయంగా అభినందించడం ఎంతో ఆనందంగా ఉందని ఉమర్ ఖాన్ తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు మండల కేంద్రంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి నారా లోకేష్‌ను ఉమర్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమర్ ఖాన్ పార్టీ కోసం చేస్తున్న సేవలు, సామాజిక కార్యక్రమాల గురించి లోకేష్ అభినందించినట్లు తెలిపారు.

ప్రజా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో సేవలు అందించాలని మంత్రి నారా లోకేష్ సూచించినట్లు ఉమర్ ఖాన్ పేర్కొన్నారు. తన సేవలను గుర్తించి అభినందించిన మంత్రి లోకేష్‌కు ఉమర్ ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

# గోరంట్లలో ఘనంగా వినాయకుల ఊరేగింపు

**– వినాయకుని ఆలయంలో ప్రతిష్టించిన గణనాథుని మేళతాళాలతో వైభవంగా శోభాయాత్ర**

**గోరంట్ల, సెప్టెంబర్ 22, మనం న్యూస్:** గోరంట్ల పట్టణ నడిబొడ్డున కొలువైన వినాయక



ఆలయం భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి కేంద్రంగా నిలుస్తోంది. ప్రతిరోజూ వేకువజామునే ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు, మహిళలు, భక్తులు వందలాది మంది స్వామివారిని దర్శించుకుని తమ దినచర్యను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. మంచి జరగాలని, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తులు నిత్యం వినాయకుడిని దర్శించుకుంటున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ దీపాలతో మైమరిపించేలా అలంకరించిన అశ్వవాహనంపై వినాయకుడిని కొలువుదీర్చి మేళతాళాల నడుమ పట్టణ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**75 కేజీల వెండి వినాయక విగ్రహం ఊరేగింపు**

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో వెండి వినాయకుడి ఊరేగింపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా వెండి వినాయకుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది 75 కేజీల వెండి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వెండి వినాయకుడిని ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి మేళతాళాల నడుమ పట్టణ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వాసవీ దేవాలయంలో నిర్వహించిన లడ్డూ వేలంలో ఎం. వంశీకృష్ణ రూ. 19,500కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలరాం గుప్తా, కార్యదర్శి నందగోపాల్, జయం సుధాకర్, మురళీకృష్ణ, తిరుపాల్, మణికంఠ, రాజా తదితరులతో పాటు సంఘం సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక అధికారి శ్రీనివాసులు సమీక్ష

**-గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలి.. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలి**

**-క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై వేగంగా విచారణ.. పోలింగ్ కేంద్రాల్లో క్షేత్రస్థాయి ప్రక్రియ పరిశీలన**

**-ఓటర్ల జాబితాలో పారదర్శకతకు ప్రాధాన్యం.. నిబంధనలు కచ్చితంగా పాటించాలి**

**పుట్టపర్తి అక్టోబర్ 22 మనం న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించిన ప్రత్యేక అధికారి, ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా. కె. శ్రీనివాసులు, ఐఏఎస్ మంగళవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియను ఆయన సవివరంగా పరిశీలించారు.




పర్యటనలో భాగంగా 157--హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చిలమత్తూరు మండలం కోడూరు పోలింగ్ కేంద్రం, 158--పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గోరంట్ల మండలం మందలపల్లి పోలింగ్ కేంద్రాన్ని డా. శ్రీనివాసులు సందర్శించారు. ఆయా కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియను నేరుగా పరిశీలించారు. ఫారమ్‌లకు సంబంధించి నిర్వహిస్తున్న విచారణలు, నోటీసుల బట్వాడా, కొత్త ఓటర్ల దరఖాస్తులు, తొలగింపులు, సవరణలపై వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు సేకరిస్తున్న ఆధార పత్రాలు, నమూనాలు, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న రిజిస్టర్లను కూడా డా. శ్రీనివాసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లాలోని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి, నోటీసులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా విచారణలను 100 శాతం పూర్తి చేసి పరిష్కరించాలని డా. శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆర్ఓ లాగిన్‌లో అందుబాటులో ఉన్న విచారణ పత్రాలను పరిశీలించి, పత్రాలు, ఆధారాలు స్పష్టంగా ఉండేలా చూడాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలు, కాలపరిమితులను కచ్చితంగా పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, సమగ్రత, పారదర్శకతను కాపాడాలని డా. శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్టోరల్ విభాగ అధికారులు, సంబంధిత నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల రాక

**- ఈనెల 23,24వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులుఅనంతపురం జిల్లా పర్యటన - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**- జిల్లాలో పర్యటించనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు**

**అనంతపురం, కలెక్టరేట్ సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** ఈనెల 23, 24వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (అప్స్పీసీర్ ) సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు. ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఐసిడిఎస్ కేంద్రాలు, కేజీబీవీలు మరియు సిసిఐలను తనిఖీలు చేస్తారు. మధ్యాహ్నం 01:30 గంటల నుంచి 02:00 గంటల వరకు ఎన్జీవోలతో



ఇంటరాక్ట్ అవుతారు. మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లను తనిఖీ చేస్తారు మరియు ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రికి వారు జిల్లాలో బస చేస్తారు. ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు అనంతపురం కలెక్టరేట్ లో ఉమెన్‌డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, జువైనల్ జస్టిస్ బోర్డ్, ఫుడ్ సేఫ్టీ, డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఓ, డిఐఈఓ, పిడి ఎస్ఎస్ఏ, రెవెన్యూ శాఖ, పిడఆర్డీ, ఎంఎయుడి, విద్యాశాఖ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, లేబర్, విలేజ్ / వార్డు చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్‌డ మైనార్టీ కమిటీ, పోలీస్, ఆర్టీవోరూరల్, వాటర్‌సప్లై, మున్సిపల్, పంచాయతీ రాజ్, తదితర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం 05:30 గంటలకు అనంతపురం జిల్లా నుంచి బయలుదేరి అన్నమయ్య జిల్లాకు వెళతారు.

# వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

**నల్లచెరువు సెప్టెంబర్ 22 మనం న్యూస్:** గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం వీఆర్ఏలు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. నల్లచెరువు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న దీక్షలకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మధునాయక్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి మా బున్నీసా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. వీఆర్ఏలు దశాబ్దాలుగా గ్రామాల్లో ప్రజలకు, రెవెన్యూ అధికారులకు సేవలందిస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పే స్కేల్ అమలు, కారుణ్య నియామకాలు చేపట్టడం, వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించడం, వీఆర్ఏల స్థానంలో నామినీలుగా పనిచేస్తున్న కుటుంబ సభ్యులను వీఆర్ఏలుగా కొనసాగించడం తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం అనేక సంవత్సరాలుగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో విజయవాడలో నిర్వహించిన వీఆర్ఏల



మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వీఆర్ఏలు తరలివచ్చి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు వీఆర్ఏలు సిద్ధమవుతారని ఆంజనేయులు హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ఏలు, ప్రజలు పాల్గొన్నారు.




# కరువును అంచనా వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**-కరువును జాతీయ విపత్తుగా గుర్తించాలిని డిమాండ్ .**

**-రెండోరోజు కొనసాగిన కరువు దీక్షలు.**

**కుందుర్పి , సెప్టెంబర్ 22 మనం న్యూస్ :** కరువును అంచన వేయడంలో రాష్ట్ర కూటమి ప్రభుత్వం విఫలం అయిందని సిపిఐ నియోజకవర్గ సహాయకార్యదర్శి, చెనక్కయ, నరసింహులు , తాలూకా సమితి సభ్యులు, రాందాసు లు విమర్శించారు. మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో కరువును జాతీయ విపత్తుగా గుర్తించి, అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఐ జిల్లా పార్టీ పిలుపు మేరకు కుందుర్పి తహసిల్దార్ కార్యాలయం ముందు కరువు దీక్షలు రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మాట్లాడుతూ కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి, చిన్న కారు రైతులుకు,కూలీలుకు, కరువు పించనులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కరువు పరిస్థితులను పట్టించుకోకపోవడం దురదృష్టం అన్నారు. కరువును జాతీయ విపత్తుగా ప్రకటించడంతోపాటు, రైతులకు, వ్యవసాయ కూలీలకు కరువు పెన్షన్లు మంజూరు చేయాలని, రైతుల అన్ని రకాల బ్యాంకు రుణాలు రద్దు చేయాలని, పశువులకు పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పంట నష్ట పరిహారం ఇవ్వడంతో పాటు పంటలు బీమా అమలు చేయాలని, విద్యార్థుల అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని, కూలీలకు షరతులు లేకుండా ఉపాధి హామీ పని కల్పించాలని, అన్ని గ్రామాలకు ఉచిత త్రాగునీటి సౌకర్యం అందించాలని, వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బెస్తరపల్లి, బి. కే.గోపాల్ కిష్టప్ప,బొమ్మయ్య ,బండమీదపల్లి ఈరన్న, నాగభూషణ. నియోజకవర్గ మహిళా సమైక్య కార్యదర్శి కవిత, మండల సమాఖ్య కార్యదర్శి ,బెస్తరపల్లి సుమలత,శాఖ కార్యదర్శి, ప్రకాష, గోవిందరాజులు. ఈ దీక్షకు సంఘీభావం ప్రకటిస్తూ వైయస్సార్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# పురం మున్సిపాలిటీకి మహర్దశ

**– అభివృద్ధి పనులకు వరదలా వస్తున్న నిధులు**

**హిందూపురం (మనం న్యూస్) సెప్టెంబర్ 22.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణాల ముఖచిత్రం మారేలా ప్రపంచస్థాయి మౌలిక వసతుల అభివృద్ధి కోసం 26 జిల్లాల్లోని 123 మున్సిపాలిటీలలో రూ.11,360 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అయితే హిందూపురం మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు నిధులు వరదలా వస్తున్నాయి. ఇది వరలో రూ.92 కోట్లు డిమాండ్ సి సి రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. ఇటీవలే త్రాగునీరు, సమ్మర్ ట్యాంకుల నిర్మాణం కోసంరూ 230 కోట్ల విడుదల అయ్యాయి. ఆ వెనువెంటనే రూ.30 కోట్లు మంగళవారం విడుదల కావడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఏ ఏ రోడ్డుకు, ఏయే మురుగు కాల్వకు ఎంతెంత మంజూరయ్యాయనే విషయం మున్సిపాలిటీ అధికారులు స్పష్టం చేయవలసి ఉంది. ఇందులో భాగంగా హిందూపురం పట్టణ అభివృద్ధి కోసం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా హిందూపురం పట్టణంలోని ఐఎంఏ హాల్ నందు మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాస రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ లు జెవి అనిల్ కుమార్, రమేష్ కుమార్, నాగరాజు, పరిమళ, బేవినహల్లి ఆనంద్, వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ వి మల్లికార్జున, మాజీ కౌన్సిలర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

